ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 6, సెప్టెంబరు 2025





దోర్నాల పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు (ఫైల్)

మనీ మాయగాళ్లు

అధిక వడ్డీ, కమీషన్ల పేరుతో మోసం

- భారీ మొత్తాల్లో నష్టపోతున్న జనం
- ప్రజల్లో అత్యాశే మోసగాళ్లకు అవకాశం

ప్రజలను మోసగించే వారి నేర స్వభావం మారిపోయింది. గతంలో ప్రత్యక్షంగా మోసం చేసే మాయగాళ్లు ఇప్పుడు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. సాంకేతికతను వినియోగించుకొని ప్రజల అత్యాశను ఆసరాగా మార్చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. వీటిపై పోలీసుశాఖ పలు విధాలుగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కానీ కొన్ని మోసాలు ఎక్కడో ఒకచోట వాటి స్వరూపాన్ని మార్చుకుని వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇటీవల దోర్నాలలో బయటపడిన హుజ్ అనే మనీ యాప్ ఇందుకు నిదర్శనం.

త్రిపురాంతకం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అమాయకత్వం, ఆశను ఆసరా చేసుకొని మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. అధిక వడ్డీ, భారీగా కమీషన్లు, యాప్‌లలో పెట్టుబడులంటూ మాయమాటలతో బురిడీ కొట్టిస్తున్నారు. వారి మోసంతో వేలాది మంది కోట్లల్లో డబ్బులను పోగొట్టుకుంటున్నారు. ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదులు వెళుతుండటంతో వారు ఏం చేయలేక చేతులెత్తేస్తున్నారు. ఇందుకు ఇటీవల దోర్నాలలో వెలుగుచూసిన హుజ్ యాప్ మోసమే ఉదాహరణ. రూ.2,100తో ప్రారంభమై అందుకు రెట్టింపు ఇస్తామని నమ్మబలికి రూ.లక్ష కట్టిన తరువాత యాప్ ద్వారా ఖాతాల్లో ఉన్న మొత్తం ఖాళీ అవుతోంది. ఇదేవిషయమై ఇటీవల బాధితులు దోర్నాలలో పోలీసులను ఆశ్రయించారు. గతంలో ఇటువంటి మోసగాళ్ల ద్వారా నష్టపోయిన వారు ఎందరో ఉన్నారు. గొలుసుకట్టు వ్యాపారాల ద్వారా కొంతమంది మోసపోగా ఇటీవల నరసరావుపేట కేంద్రంగా పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో మోసాలకు పాల్పడి దాదాపు రూ.800 కోట్లు కొల్లగొట్టిన ఒక ముఠా ద్వారా కూడా ఎర్రగొండపాలెం నుంచి ఒకరిద్దరు నష్టపోయారని తెలిసింది. యానిమేషన్ చిత్రాల నిర్మాణం ద్వారా వచ్చే లాభాలతో లక్షలు వస్తాయని చెప్పడంతో వీళ్లు భారీమొత్తంలో పెట్టుబడి పెట్టి లబోదిబోమన్నారు. కానీ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సాహసించలేదని తెలిసింది.



కొత్త వ్యక్తుల మాయలో మోసపోయిన కొందరు

తాము లక్షల్లో పెట్టుబడులు పెట్టి కోట్లలో వ్యాపారాలు చేశామని చెప్తూ కొందరు ఒంటినిండా బంగారు ఆభరణాలతో వచ్చి మాయమాటలు చెప్పడంతో వారిని చూసి పలువురు వ్యాపారులు మోసపోతున్నారు. ఇటీవల పెద్దారవీడు మండలం కుంట వద్ద గొర్రెల కొనుగోలుకు వచ్చిన ఒక వ్యక్తి చేసిన మోసం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అక్కడ మొదట్లో రూ.10వేలు ఖరీదు చేసే గొర్రెలను రూ.15 నుంచి రూ.17వేలు చెల్లించి కొని నమ్మకంగా కొన్ని వారాలు వ్యాపారిలా అందరినీ ఆకట్టుకున్నాడు. తరువాత గొర్రెలను

మిగతా 6వ పేజీలో



ఉపాధ్యాయ.. ఉండ్రాలయ్యా.

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండపాల్లో కొలువైన గణనాథుడిని భక్తులు వివిధ రకాలుగా అలంకరిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని రాజాపానగల్ రోడ్డులోని విఘ్నేశ్వరుడిని శుక్రవారం పెన్నులు, పుస్తకాలు, ప్యాడ్‌లతో అలంకరించారు. ప్రజలు తరలివచ్చి దర్శించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు

గనుల్లో ఆక్రమణలపై హైకోర్టు ఆగ్రహం

- తీసుకున్న చర్యలను నివేదించాలని ఆదేశం
- విచారణను ఆరు వారాలు వాయిదా వేసిన ధర్మాసనం
- మైన్స్ అధికారుల మల్లగుల్లాలు.. ప్రత్యేక సమావేశం



రామతీర్థం పరిసరప్రాంతంలో వాగును ఆక్రమించి ఏర్పాటు చేసిన డంప్‌లు

చీమకుర్తి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గెలాక్సీ గ్రానైట్ గనుల యజమానుల్లో కొందరు వాగులు, కాలువలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి కార్యకలాపాలు సాగిస్తుండటంపై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆక్రమణలపై ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలు, తదుపరి కార్యాచరణను నివేదించాలని అధికారులను ఆదేశించింది. విచారణను ఆరు వారాలపాటు వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. చీమకుర్తి, రామతీర్థం పరిసర ప్రాంతాల్లో గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించింది. దాదాపు 42 క్వారీలకు సంబంధించి 150కి పైగా లీజులు మంజూరయ్యాయి. లీజుదారుల్లో కొందరు నిబంధనలను ఉల్లంఘించారు. తమ పట్టాభూములకు సమీపంలో ఉన్న వాగు, కొండ పోరంబోకు, ఇరిగేషన్‌తోపాటు ప్రభుత్వ భూములను ఆక్రమించి క్వారీయింగ్ చేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కొందరు జిల్లా ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి కోరారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో హైకోర్టులో ప్రజాప్రయోజన

మిగతా 6వ పేజీలో



గురుపూజోత్సవ సభలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, వేదికపై ఎమ్మెల్యే బీఎన్, మారిటైం బోర్డు చైర్మన్ సత్య, మేయర్ సుజాత



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

స్ఫూర్తిప్రదాతలు గురువులు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- 53 మంది ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి దిశా నిర్దేశం చేసే స్ఫూర్తిప్రదాతలు గురువులని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ఉన్నత వ్యక్తిత్వం గల పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదన్నారు. అయితే ఇటీవల వారు ఎందుకో వెనుకబడుతున్నారన్నారు. దీనిపై ఒకసారి ఆత్మావలోకనం చేసుకొని తమ ధర్మానికి పునరంకితమై విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే ఉన్నతులుగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ

మిగతా 6వ పేజీలో



నాట్యం చేస్తున్న యువతి

8 మంది డీటీలకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి

పలువురికి పోస్టింగ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 8 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారిలో కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురిని మన జిల్లాలోనే నియమించారు. ఇద్దరిని బాపట్లకు, మరో ముగ్గురిని నెల్లూరు జిల్లాకు కేటాయించారు. సంతనూతలపాడు డీటీ రఫీని ఒంగోలు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, ఒంగోలు డీటీ కృష్ణమోహన్‌ను త్రిపురాంతకం, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎస్‌వీటీ రాజేష్‌ను సింగరాయకొండ తహసీల్దార్‌గా నియమించారు. చీరాలలో పనిచేస్తున్న జి.గీతారాణి, బల్లికురవ డీటీ కె.రవికుమార్‌ను బాపట్ల జిల్లాకు కేటాయించారు. చీమకుర్తి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఎన్.జయలక్ష్మి, సీఎస్‌పురం డీటీ పి.వెంకటేశ్వర్లు, మంగళగిరిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టులో పనిచేస్తున్న జె.వేణుగోపాల్‌ను నెల్లూరు జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొనకనమిట్లలో ఏం జరుగుతోంది?

- నాలుగు నెలల్లో వీఆర్‌కు ఇద్దరు ఎస్సైలు
- అవినీతి ఆరోపణలు, విధుల్లో నిర్లక్ష్యమే కారణం



6

మార్కాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం నియోజకవర్గంలోనే అత్యంత క్లిష్టమైన పోలీస్‌స్టేషన్ కొనకనమిట్ల. ఇక్కడ పనిచేయాలంటే ఏ అధికారికి అయినా కత్తిమీద సామే. ఇక్కడి రాజకీయ నాయకులు, ప్రజలు వ్యవహరించే తీరు భిన్నంగా ఉంటుంది. చిన్నపాటి సంఘటనను కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముందుకు వెళ్తుంటాయి. మండల పరిధిలో చాలా వరకు సమస్యాత్మకమైన గ్రామాలున్నాయి. ఎన్నికల సమయాల్లో ఆయా గ్రామాల్లో పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయి. గతంలో నాటుబాంబులు వేసుకోవడం, బీభత్సమైన దాడులు చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఇక్కడకు వచ్చే అధికారులు ఎంతో నిబద్ధతతో పనిచేస్తేనే కొన్నాళ్లపాటు ఉండగలిగేది. కానీ అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం కారణంగా నాలుగు నెలల వ్యవధిలోనే ఇద్దరు పోలీసు అధికారులను జిల్లా పోలీస్ బాస్ వీఆర్‌కు పంపడం గమనార్హం.

నాలుగు నెలల క్రితం వీఆర్‌కు వెళ్లిన ఎస్సైపై లెక్కకు మిక్కిలిగా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఏ చిన్నపాటి ఫిర్యాదు కోసం ప్రజలు స్టేషన్‌కు వెళ్లినా ముక్కుపిండి మరీ వసూళ్లకు పాల్పడేవాడు. వైసీపీకి చెందిన నాయకులతో అంటకాగుతూ అక్రమాలపై నమోదైన కేసుల్లో అరెస్టులు చేయకుండా నెలలపాటు తాత్సారం చేశాడు. కిందిస్థాయి సిబ్బందిని కూడా ఆ అధికారి ఇబ్బందులకు గురి చేశాడు. అతనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు జిల్లా అధికారులకు అందాయి. విచారణ చేపట్టి

మిగతా 6వ పేజీలో

రైలులో 11 కిలోల గంజాయి పట్టివేత

6

- పోలీసుల అదుపులో ఇరువురు నిందితులు
- మరో ఏడుగురు అనుమానితులపై కొనసాగుతున్న విచారణ

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమాదేవి

6

ఏడుగురు వైసీపీ నేతలపై కేసు

చిన్నారుల చేత 'రప్పా రప్పా' ప్లకార్డుల ప్రదర్శనపై పోలీసుల చర్యలు

6

సూర్య కాంతితో ఇంటికి వెలుగు

పీఎం సూర్యఘర్ పథకంతో బిల్లులు ఆదా

- జిల్లాలో లక్షకు పైగా దరఖాస్తులు
- మార్కాపురం డివిజన్‌లో శరవేగంగా యూనిట్ల ఏర్పాటు
- ఇప్పటికే పలువురి ఇళ్లపై బిగింపు



7

ఎంపీడీవోలు వస్తున్నారు!



- ఉద్యోగోన్నతి పొందిన 20 మంది జిల్లాకు కేటాయింపు
- ప్రస్తుతం 19 మండలాల్లో ఇన్‌చార్జిలు
- వారిస్థానంలో త్వరలో పూర్తి బాధ్యతలతో కొత్తవారు
- వేగవంతం కానున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో కీలకంగా పనిచేసే మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు ప్రజాప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జడ్పీ, పంచాయతీ శాఖల్లో పనిచేస్తున్న పలువురికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పించింది. జిల్లాకు 20 మందిని కేటాయించింది. వారికి త్వరలో పోస్టింగ్‌లు ఇవ్వనుంది. దీంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వేగవంతం కానుంది.

వైసీపీ హయాంలో పట్టించుకోని వైనం

గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి జిల్లాలో ఎంపీడీవోల కొరత వేధిస్తోంది. కొత్త నియామకాలు చేపట్టకపోవడం, ఉద్యోగోన్నతులు సకాలంలో కల్పించకపోవడంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల స్థాయిలో ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలలో ఎంపీడీవోలే కీలకమన్న విషయాన్ని గుర్తించిన ప్రస్తుత ప్రజాప్రభుత్వం

మిగతా 6వ పేజీలో

రైలులో 11 కిలోల గంజాయి పట్టివేత

ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మరో ఏడుగురు అనుమానితులపై కొనసాగుతున్న విచారణ



నిందితులతోపాటు గంజాయిని చూపిస్తున్న పోలీసులు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 5(ఆంధ్ర జ్యోతి) : పూరి ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించిన పోలీసులు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి పూరి నుంచి తిరుపతి వెళుతున్న రైలులో ఈగల్ టీమ్‌తో పాటు జీఆర్పీ పోలీసులు కలిసి తనిఖీలు చేశారు. ఒంగోలు-సింగరాయకొండ మధ్యలో ఓ బోగీలో 10 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకొని అక్రమంగా గంజాయి తరలిస్తున్న చెన్నై వడపళనికి చెందిన ప్రేమ్‌చంద్, సౌకార్‌పేట్‌కు చెందిన మనీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో మరో బోగిలో కిలో గంజాయి పోలీసులకు దొరికింది. దాన్ని ఎవరు తరలిస్తున్నారని అనుమానించి ఏడుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. ఈ తనిఖీలలో మహిళ పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్సైలు శ్రీకాంత, ఆంజనేయులు, చెంచయ్య, జీఆర్పీ ఎస్సై మధుసూదనరావులతోపాటుగా సిబ్బంది ఉన్నారు. గంజాయి పట్టుకున్న పోలీసులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించారు.

ఏడుగురు వైసీపీ నేతలపై కేసు

ముక్కుపచ్చలారని చిన్నారుల చేత రప్పా రప్పా ప్లకార్డుల ప్రదర్శనపై పోలీసుల చర్యలు

పొన్నలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): రెడ్డి గారి ప్రభుత్వం వస్తే ఒక్కొక్కడికి రప్పా రప్పా.. నేడు మీది, రేపు మాది.. అంటూ రెచ్చగొట్టేలా వైసీపీ నేతలు వ్యవహరించిన తీరుపై పోలీసులు కన్నెర్ర చేశారు. ఆ పార్టీకి చెందిన ఏడుగురు నేతలపై కేసు నమోదు చేశారు. వైయస్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పైరెడ్డిపాలెంలో వైసీపీ నేతలు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ సహ పార్టీ నేతలు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం గణేష్ విగ్రహం దగ్గరకు ఊరేగింపుగా బయలుదేరిన నేతలు.. అధికార పార్టీని రెచ్చగొట్టేలా ప్లకార్డులు ప్రదర్శించారు. రెడ్డి గారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్కొక్కడికి రప్పా రప్పా.. నేడు మీది రేపు మాది అంటూ నినాదాలు కూడా చేశారు. చిన్నారుల చేత కూడా ప్లకార్డులు చేతబట్టించి రెచ్చగొట్టేలా నినాదాలు చేయించిన వైసీపీ నేతల తీరును గ్రామస్థులు తప్పుబడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో దారుణమైన పరిపాలన గుర్తుకు తెచ్చుకుని, రాష్ట్ర ప్రజలు 11 సీట్లు పరిమితం చేసినా వీరి వైఖరిలో ఏ మాత్రం మార్పు రాలేదని చర్చించుకున్నారు. వైసీపీ నేతల వ్యవహార శైలిపై స్థానికటీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ చేపట్టిన పోలీసులు ఏడుగురు నేతలపై కేసు నమోదు చేశారు.



ప్లకార్డులతో చిన్నారులు, మాజీ మంత్రి సురేష్, వైసీపీ నాయకులు

గ్రామానికి చెందిన దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, కర్ల మస్తాన్ రెడ్డి, కదిరి సుధాకర్ రెడ్డి, కదిరి రవిరెడ్డి, కదిరి కృష్ణారెడ్డి, సిరిగిరి రామకృష్ణారెడ్డి, దారా చినరామయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనుక్ తెలిపారు.

మనీ మాయగాళ్లు

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేసి డబ్బుకు వాయిదా వేసి వెళ్లిపోయి దాదాపు రూ.2కోట్లకు కుచ్చుటోపీ పెట్టడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఇందులో ఒక్క పుల్లలచెరువు మండలంలోని వ్యాపారులకే దాదాపు రూ.80లక్షలు ఎగనామం పెట్టాడు. కొత్తగా వచ్చిన వ్యక్తుల మోసపు మాటలను వ్యాపారులు నమ్మవద్దని పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు.

ఏపీకే ఫైళ్లతో మనీ దోపిడీ

ప్రస్తుతం సాంకేతికతను మోసగాళ్లు ఉపయోగించి ప్రజల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా ఏపీకే అని వచ్చే ఫైళ్లను తెరవవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నా చాలామంది వాటిని వాట్సాప్‌ల ద్వారా పంపుతూనే ఉన్నారు. ఇలా వచ్చే ఫైల్‌ను ఓపెన్ చేయగానే అందులో మీరు రూ.100 కడితే రూ.200 వస్తాయని సందేశం ఉంటుంది. మొదట రూ.100తో ప్రారంభమై తరువాత లక్షల్లో వాటి మోజులో పడిన ప్రజలకు సదరు యాప్ తాలూకు వ్యక్తులు కోట్లలో కొల్లగొట్టి యాప్ క్లోజ్ చేయడం జరుగుతుంది. దోర్నాలలో జరిగిన మనీ యాప్ మోసం కూడా ఇలాంటిదే. ఇలా పోగొట్టుకున్న తరువాత మోసపోయామని పోలీసులను ఆశ్రయించినా ఆ యాప్‌ల ఆచూకీ తెలుసుకునేందుకు ఫేక్ ఐడీ, ఫేక్ అడ్రస్‌ల కారణంగా జాప్యం జరుగుతుందని పోలీసులు చెప్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం

డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో మోసగించే ప్రక్రియకు కొందరు శ్రీకారం చుట్టారు. త్రిపురాంతకం మండలంలో ఒక ప్రధానోపాధ్యాయుడికి ఇటీవల ఒక ఫోన్‌కాల్ వచ్చింది. మీ ఆధార్ కార్డు బ్లాక్ అయింది. మీ బ్యాంకు ఖాతా సక్రమంగా నడవాలంటే ముందుగా మీరు రూ.50వేలు పంపితే తరువాత దానిని సరిచేసి మీ నగదు మీరు తీసుకోవచ్చని చెప్పారు. కానీ ఆ ప్రధానోపాధ్యాయుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దానికి అడ్డుకట్ట పడింది. కానీ ఇటీవల ఈ తరహా ఫోన్‌లు చేస్తూ మీ అబ్బాయి కేసులో దొరికాడని.. లేదా మీకు వచ్చిన పార్శిల్‌లో గంజాయి, డ్రగ్స్ ఉన్నాయని వాటిలో మీరు అరెస్ట్ కాకుండా ఉండాలంటే మేము చెప్పిన నగదు పంపాలని బెదిరింపులు రావడంతో కొందరు ఈ విషయం ఎవరికి చెప్పుకోలేక నగదు చెల్లిస్తున్నారు. ఇటువంటి మోసాలపట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

24 గంటల్లో ఫిర్యాదు చేస్తే అడ్డుకోగలం

ప్రభాకరరావు, ఎర్రగొండపాలెం సీఐ



మోసపోయామని, మనీ పోగొట్టుకున్నామని 24 గంటలలోపు మాకు ఫిర్యాదు చేస్తే యాప్‌ల ద్వారా నగదు పోకుండా సాధ్యమైనంతవరకు అడ్డుకోగలం. కానీ చాలా ఆలస్యంగా ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజల్లో అవగాహన కోసం ఇటీవల పోలీసు శాఖ ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. కానీ ఎర్రగొండపాలెంలో కొందరు ఒక యాప్ ద్వారా మనీ స్కీంకు డబ్బులు కడుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. దయచేసి అత్యాశకు పోవద్దు. ఇప్పటికైనా అలాంటి వ్యక్తులు కనిపించినా, ఫోన్ కాల్స్ వచ్చినా తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తే అడ్డుకట్ట వేసి మోసగాళ్లకు ముకుతాడు వేస్తాం.

నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఉచితంగా పంపిణీ

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్‌బాబు

మార్టూరు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బొబ్బేపల్లికొండపై ఫారెస్ట్ అటవీ భూములలో పెంచుతున్న నర్సరీ నుంచి అవసరమైన వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోని బొబ్బేపల్లి కొండపై 350 ఎకరాల వరకు అటవీ భూములు ఉన్నాయి. ఈ భూములలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటుచేసి, 40 వేల మొక్కలను పెంచుతున్నామన్నారు. ఈ నర్సరీలో చింత, నేరేడు, ఉసిరి, జామ, దానిమ్మ, నిమ్మ, రావి తదితర మొక్కలను పెంచుతున్నారు. అయితే చుట్టుపక్కల గ్రామాలలోని ప్రభుత్వ స్కూళ్లు, లేదా ప్రైవేటు విద్యాలయాలు, ఇంకాఏమైనా సంస్థలు వారు, మొక్కలు కావల్సిన వారు సంబంధిత అధికారుల ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. అంతేగాకుండా ఎవరైనా గ్రామస్తులు ఆధార్ కార్డుతో వస్తే నాలుగు లేదా 5 మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఇంకా భారీగా మొక్కలు కావలసిన వారు ఎంపీడీవో ధ్రువీకరణ పత్రంతో వస్తే మొక్కలను పంపిణీ చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా ఫారెస్ట్ కొండపై కొంతమంది వన్యప్రాణులను వేటాడుతున్నారని, జంతువులను పట్టుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో శుక్రవారం ఆయన కొండ సమీపంలో, టీడీపీ నాయకులు చింతలపూడి శ్రీనివాసరావు సమక్షంలో రాజుగారిపాలెం వాసులతో మాట్లాడారు. అటవీ భూములలో వేట నిషిద్ధమన్నారు.కొండపై జంతువులను వేటాడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలు



రాజుపాలెం వాసులతో మాట్లాడుతున్న అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రకాశం జిల్లా నుంచి నలుగురు టీచర్లకు అవార్డులు అందజేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్



సీఎం బాబు, మంత్రి లోకేష్ చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న సరోజినీదేవి, ఈశ్వరమ్మ, భాస్కరరావు, సుధాకర్

విజయవాడ సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ప్రకాశం జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో మొగళ్లూరు జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న సరోజనీదేవి, పీసీపల్లి జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న ఈశ్వరమ్మ, తంగెళ్ల జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న బాస్కరరావు, తర్లుపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుధాకర్‌లు ఉన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం

చెరుకూరు (పర్చూరు), సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ, అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామివార్ల కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లకు హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహణ కార్యదర్శి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

స్ఫూర్తి ప్రదాతలు గురువులు

(5వ పేజీ తరువాయి)

విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి విద్యార్థులను ఉన్నతంతా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. విద్యకు ఏటా 30వేల కోట్లు ఖర్చు చేస్తున్నదన్నారు. పాఠశాలల్లో అన్ని సదుపాయమాల కల్పనకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని సత్ఫలితాలు తేవాలని కోరారు. డీఈవో కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మేయర్ గంగాడ సుజాత, డీఆర్వో చినఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 53 మందిని సన్మానించారు. వారికి అవార్డులను ప్రదానం చేశారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమాదేవి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఒంగోలు నియోజకవర్గం బీసీ సామాజిక వర్గానికి చెందిన తమ్మిశెట్టి రమాదేవిని నియమిస్తూ టీడీపీ అధిష్టానం ప్రకటించింది. గతంలో ఒంగోలు నగర మహిళ అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమె గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో రమాదేవికి రాష్ట్ర వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి లభించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): అత్యవసర మరమ్మతుల కారణంగా, శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు స్థానిక విద్యుత్‌శాఖ అధికారి శేషగిరి రావు ఒక ప్రకటనలో తెలిపారు పీఆర్ కాలనీలోని అర్బన్‌కాలనీ ఫీడర్ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి, కోర్టు వీధి, కొంగళవీడు రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, విశ్వభారతి పాఠశాల, కొప్పు వారివీధి, పాండురంగారెడ్డి నగర్, ఏబీఎంపాలెం, ఎస్‌పీజేపాలెం, వినాయక నగర్, లైబ్రరీ, శ్రీరాములువీధి, అగ్గిపెట్టెల బజారు, వాసవీ అపార్ట్‌మెంట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

20మందికి కుక్కకాటు

కొమరోలు, సెప్టెంబరు5 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొమరోలు, తాతారెడ్డిపల్లి, పురుషోత్తంపల్లి, గోపాని పల్లి గ్రామాల్లో పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తూ 20మందిని కరచింది. ఆయా గ్రామాల్లోని రోడ్లపై వెళ్తున్న పిచ్చికుక్క కనపడిన వారిని ఇష్టంవచ్చినట్లు కరుస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి పిచ్చికుక్క కాటుకు గురైన బాధితులు కొమరోలు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకున్నారని, 20మందికి టీకాలు వేశామని వైద్యసిబ్బంది తెలిపారు. తీవ్రంగా గాయాలకు గురైన నలుగురిని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు పంపి హిమోగ్లోబిన్ వ్యాక్సిన్ వేయించారని తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఈద్ మిలాదుల్ నబీ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈద్ మిలాదుల్ నబీ పురస్కరించుకుని శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మార్కాపురం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలలో, అనాథ ఆశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి మార్కాపురం అధ్యక్షుడు మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వెనుక ఒక నిరుపేద కుటుంబానికి బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ షబానా నిత్యావసర వస్తువులు అందజేశారు.

బ్రహ్మయ్య కుటుంబానికి వైసీపీ నేతల పరామర్శ

కంభం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట సమీపంలో బుధవారం రాత్రి హత్యకు గురైన కంభం మండలం దర్గా గ్రామానికి చెందిన గాలి బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి పరామర్శించారు. మీ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంతకు ముందుగా ఆయన కంభం వైద్యశాలలో మార్చురీలో ఉన్న గాలి బ్రహ్మయ్య మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. శివప్రసాద్ రెడ్డి వెంట గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి కుందూరు నాగార్జున రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీఇవీ

చీమకుర్తి తూర్పుబజార్‌లో వినాయక లడ్డూ రూ.2.10లక్షలు

అట్టహాసంగా స్వామి నగరోత్సవం



లడ్డూని ఊరేగింపుగా తీసుకెళ్తున్న కోటేశ్వరరావు చౌదరి

చీమకుర్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి నగర పంచాయతీ పరిధిలోని తూర్పుబజార్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం వద్ద పూజలో ఉంచిన లడ్డూకి శుక్రవారం రాత్రి నిర్వహించిన వేలం పోటాపోటీగా సాగింది. టీడీపీ నాయకుడు గొల్లపూడి కోటేశ్వరరావుచౌదరి(చిన్న చౌదరి) లడ్డూను రూ.2.10లక్షలకు దక్కించుకొని ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించే భాగంగా రాత్రి పట్టణంలో నగరోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



శ్మశాన భూమి ఆక్రమణ అడ్డుకుంటున్న దళితులు

రాచర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన భూమిని ఆక్రమించుకున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల సభ్యులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పాలకవీడు గ్రామంలో ప్రభుత్వం దళితులకు శ్మశానం కొరకు స్థలం మంజూరు చేసిందని, దానిని కొందరు గ్రామస్థులు ఆక్రమించుకొని సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారి ప్రయత్నాలను తాము అడ్డుకున్నామని అధికారులు కూడా ఈ విషయమై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ సభ్యులు కత్తి అనోజీరావు, పరదేశి రాజశేఖర్, సోమవరపు ఆరోగ్యం, చిట్టెం భాస్కర్, గోన కాశయ్య, కుందేటి ఆశీర్వాదం పాల్గొన్నారు.

గనుల్లో ఆక్రమణలపై హైకోర్టు సీరియస్

(5వ పేజీ తరువాయి)

వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో కూడిన ధర్మాసనం ఆక్రమణల గుర్తింపు, తొలగింపుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. జిల్లా మైన్స్ అధికారులు గురువారం ఒంగోలులోని కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. హైకోర్టు ఆదేశాలను సమీక్షించి నివేదించాల్సిన అంశాలపై చర్చించారు. తదుపరి వాయిదా లోపు గెలాక్సీ గ్రానైట్ గనుల్లో నెలకొన్న ఆక్రమణలను తేల్చాలని నిర్ణయించుకున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకొని న్యాయస్థానానికి నివేదించాలన్న యోచనలో ఉన్నారు. ఇదిలా ఉండగా ఆక్రమణలపై గత కొన్ని నెలల క్రితం జాయింట్ కమిటీతో సర్వే ప్రారంభించిన అధికారులు మధ్యలోనే రాజకీయ ఒత్తిళ్లతో నిలిపివేశారు. ఇప్పుడు కోర్టు ఆదేశాలతో మళ్లీ కదిలారు. ఎంత మేరకు సర్వే చేసి ఆక్రమణలపై నిగ్గు తేలుస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఎంపీడీవోలు వస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగోన్నతులకు మోక్షం కల్పించింది. జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న పరిపాలనాధికారులు (ఏవో), పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్‌డీ)ల సీనియారిటీ జాబితాలను పీఆర్ కమిషనర్ తెప్పించుకున్నారు. అర్హత ఉన్న వారందరికీ ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో మన జిల్లాకు 20 మందిని కేటాయించారు.

త్వరలోనే కొత్తవారు నియామకం

ఉమ్మడి జిల్లాలోని 19 మండలాల్లో ఎంపీడీవోల కొరత ఉంది. ఆ మండలాల్లో డిప్యూటీ ఎంపీడీవోలు లేదా పరిపాలనాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలన్నీ ఎంపీడీవోల పర్యవేక్షణలోనే కొనసాగుతాయి. ప్రధానంగా గ్రామాల్లో కీలకమైన ఉపాధి హామీ పథకం పనుల కేటాయింపు, కూలీలకు వేతనాల చెల్లింపు, నెలవారీ ఇచ్చే సామాజిక పింఛన్లు, వివిధ పథకాల కింద లబ్ధిదారుల ఎంపిక వంటి కార్యక్రమాలన్నీ ఎంపీడీవోల పర్యవేక్షణలో జరుగుతాయి. అయితే ఎంపీడీవోల కొరత కారణంగా ఆయా పనుల నిర్వహణలో జాప్యం జరుగుతోంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మండల స్థాయిలో కీలకంగా పనిచేసే ఎంపీడీవోల కొరత తీరడమే కాకుండా సంక్షేమ పథకాల అమలు కూడా వేగవంతం కానుంది. ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందిన వారికి త్వరలోనే పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

కొనకనమిట్లలో ఏం జరుగుతోంది?

(5వ పేజీ తరువాయి)

అతన్ని వీఆర్‌కు పంపారు. అనంతరం నెల రోజుల తర్వాత ప్రస్తుత అధికారి విధుల్లో చేరారు. ఈయన విధులపట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు ప్రారంభం నుంచి ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక కింది స్థాయి సిబ్బంది, సమస్యలపై వచ్చే ప్రజలతో సక్రమంగా వ్యవహరించడంలేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఆ అధికారి గతంలో మూడు స్టేషన్‌లలో నాలుగు నెలలకు మించి పనిచేయలేదని సమాచారం. ఆయన పై అధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోడన్న ప్రచారం ఉంది. ఆ అధికారి వ్యవహార శైలిపై ఆరోపణల నేపథ్యంలోనే పది రోజుల క్రితం పొదిలి సర్కిల్ అధికారి కొనకనమిట్ల వెళ్లి విచారించారు. పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ఆయన్ను వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఎక్కువే

కొనకనమిట్ల మండలంలో పోలీసుశాఖపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ పని చేసిన చాలా మంది ఎస్సైలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓ ఎస్సై బరితెగించి మరీ వైసీపీకి ఓట్లు వేయాలని, లేదంటే అక్రమ కేసులు బనాయిస్తానని అప్పట్లో టీడీపీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. అంతేకాక అతని సామాజికవర్గానికి చెందిన వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గంపగుత్తగా ఓట్లు వేయాలని కూడా ఆదేశాలు ఇచ్చాడు. ఎన్నికల అనంతరం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఎస్సైని బదిలీపై పంపారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం వీఆర్‌కు వెళ్లిన ఎస్సై ఎలాంటి రాజకీయ సిఫార్సు లేకుండా వీఆర్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ క్రమంలో కొన్ని విషయాల్లో అధికార పార్టీ నాయకుల మాటలను కూడా పెడచెవిన పెట్టారు. దీంతో ముఖ్య ప్రజాప్రతినిధి మందలించినట్లు సమాచారం. అయినా తీరు మార్చుకోకపోవడంతోనే ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

నిద్రిస్తున్న వ్యక్తిపై పెట్రోల్ దాడి


చికిత్సపొందుతున్న ప్రతాప్

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నిద్రపోతున్న వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. ఈ సంఘటన మండలంలోని చినకనుమళ్ల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చినకనుమళ్ల గ్రామానికి చెందిన తన్నీరు ప్రతాప్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి అతని భార్య, ఇరువురు పిల్లలు మంచంపై పడుకొని నిద్రిస్తున్నారు. పత్రాప్ తలుపు పక్కనే నేలపై నిద్రిస్తున్నాడు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి తలుపు కింద నుంచి పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. దీంతో నేలపై నిద్రిస్తున్న ప్రతాప్‌కు మంటలు అంటుకున్నాయి. వెంటనే అతను పెద్దగా కేకలు వేశాడు. నిద్రస్తున్న అతని భార్య ఒక్కసారిగా పైకిలేచి పిల్లలను తీసుకొని బయటకు వెళ్లింది. స్థానికులు వచ్చి ప్రతాప్ ఒంటిపై ఉన్న మంటలను ఆర్పారు. ఆతన్ను ప్రాథమిక చికిత్స కోసం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కందుకూరు రిమ్స్ తరలించారు. జరిగిన ప్రమాదంపై ఎస్సై బి. మహేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టెన్నికాయిట్ అండర్-18 బాలబాలికల ఉమ్మడి జిల్లా జట్లను స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఎంపిక చేశారు. ఈ జట్లు ఈ నెల 13,14 తేదీల్లో కోనసీమ జిల్లాలోని మండపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. ఎంపిక కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎన్‌టీ ప్రసాద్, ట్రెజరర్ శంకర్‌రావు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. స్వామికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, ఆచార్య రుత్విగ్వరణం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి. కృష్ణవేణి, రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషా లక్ష్మీ నరసింహాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు సత్కారం


టీడీపీ నాయకులను సత్కరిస్తున్న బింగినపల్లి నేతలు

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బింగినపల్లిలో ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వేల్పుల సింగయ్యకు ఇటీవల మండల పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నికైన మించల బ్రహ్మయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమితులైన సుదర్శి ప్రసాద్‌రావును ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సన్నెబోయిన మాలకొండయ్య, పామర్తి మాధవరావు, పుడి రోశిరెడ్డి పాల్గొన్నారు.

ఏలూరివారిపాలేనికి ఆర్టీసీ బస్సు రాకతో జోష్

● ఎమ్మెల్యే బీఎన్‌కు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్థులు


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

చీమకుర్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దశాబ్దం తర్వాత తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావటంతో ఏలూరివారిపాలెం గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణాన్ని కల్పించిన నేపథ్యంలో గ్రామానికి బస్సు రాకతో మహిళల్లో సందడి నెలకొంది. తమ ఊరికి బస్సు వసతి కల్పించాలని కోరిన కొద్దిరోజులకే ఆర్టీసీ సర్వీసు వచ్చేలా చేసిన ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఒంగోలు నుంచి బయలుదేరిన బస్సులో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, గ్రామస్థుతో కలిసి ప్రయాణించారు. గ్రామంలో ఎమ్మెల్యే బస్సు దిగగానే మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రేపు అండర్-14 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక జరుగుతుందని పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ ఉదయం 9గంటలకు ఒంగోలు నగరం మంగమూరురోడ్‌లో గల అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వైట్ డ్రస్, వైట్ షూ, సొంత కిట్‌తోపాటు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు కోచ్‌లు సుధాకర్ 9701022333, చంద్రశేఖర్ 9246222999 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

సూర్యకాంతితో ఇంటికి వెలుగు

పీఎం సూర్యఘర్ పథకంతో బిల్లులు ఆదా

జిల్లాలో లక్షకు పైగా దరఖాస్తులు

మార్కాపురం డివిజన్‌లో శరవేగంగా యూనిట్ల ఏర్పాటు

ఇప్పటికే పలువురి ఇళ్లపై బిగింపు

త్రిపురాంతకం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో నిరంతర విద్యుత్‌తోపాటు బిల్లు ఆదా కావాలని, సూర్యరశ్మి ద్వారా విద్యుత్‌వెలుగులు నింపాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకానికి ప్రజల నుంచి ఇప్పుడిప్పుడే స్పందన వస్తోంది. జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌శాఖ అధికారులు ఈ పథకం ప్రయోజనాలను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో కొంతమేర అవగాహన ఉన్న వారు తమ ఇళ్లు సూర్యఘర్ కావాలని కోరుతూ సోలార్ విద్యుత్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. దేశంలో పునరుత్పత్తి శక్తిని పెంచి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ఖర్చు తగ్గించాలని, ప్రధానంగా పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ పథకం కింద సోలార్ ప్యానెల్ ఏర్పాటుతో పాటు నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు. ఇందుకు గాను ఒక కిలోవాట్ సోలార్ సిస్టంకు రూ. 81వేలు ఖర్చు అవుతుంది. ఇందులో రూ. 30వేలు నేరుగా ప్రభుత్వ సబ్సిడీ లబ్ధిదారుని ఖాతాకు వెళుతుంది. మిగిలిన మొత్తాన్ని స్వయంగా బ్యాంకు ద్వారా రుణం పొందే అవకాశం ఉంది. రెండు కిలోవాట్స్‌కు రూ. 1.55 లక్షలు, మూడు కిలోవాట్స్‌కు దాదాపు రూ. 2.10 లక్షల వరకు ఖర్చు అవుతోంది. వీటికి రూ.60వేలు, రూ. 80వేలు చొప్పున సబ్సిడీ అందుతుంది. ఆసక్తి కనబరుస్తున్న లబ్ధిదారులు అవకాశం ఉన్న ఏజెన్సీల ద్వారా దరఖాస్తు చేసుకుని బ్యాంకు ద్వారా రుణం పొంది ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు అమర్చుకుని విద్యుత్ వినియోగించుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూరు శాతం సబ్సిడీతో దీనిని సమకూర్చుతుంది. ఈ పథకం కింద జిల్లాలో దాదాపు లక్షా 20వేల మంది వరకు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో ఇప్పటికే దాదాపు 3,200 మంది ఇళ్లకు సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఉత్పత్తి అయ్యే విద్యుత్ నెలవారీ మీటరులో రీడింగ్ అవుతుంది. అందులో ఇంటి వాడకం పోగా మిగిలిన విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేసి తద్వారా వచ్చే డబ్బును లబ్ధిదారుని ఖాతాకు వేస్తారు.


ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

మార్కాపురం డివిజన్‌లో 6వేల ఇళ్లకు



ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కోసం 18వేల మంది వినియోగదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అధికారిక సమాచారం. అందులో తొలివిడతగా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా మొదటివిడత 6వేల ఇళ్లకు ఈ పథకం ద్వారా కనెక్షన్‌లు ఇవ్వబోతున్నామని చెబుతున్నారు. వాటిలో ఇప్పటికే 234 మంది తమ ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుని విద్యుత్ వాడకం ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీలే కాకుండా మిగిలిన వర్గాల నుంచి కూడా ఆసక్తి ఉన్న వారిలో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనే 1,122 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో ఇప్పటికి 111 మంది ఇళ్లకు వీటిని ఏర్పాటు చేశారు. త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల నుంచి ఎక్కువ మంది ఈ పథకంపైఆసక్తి కనబరుస్తున్నారు. ఎర్రగొండపాలెం నుంచి 308 మంది, త్రిపురాంతకం నుంచి 394 మంది, పుల్లలచెరువుకు 240 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తానికి ప్రజల్లో అవగాహన కలిగి ఈ పథకం వినియోగించుకుంటే విద్యుత్ ఆదాతోపాటు బిల్లుల బెడద కూడా ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఎంతో ఉపయోగం



సురేంద్ర, త్రిపురాంతకం

ఈ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగం. 3 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ ఏర్పాటుకు నేను దరఖాస్తు చేసుకున్నాను. కొద్దిరోజుల క్రితమే నాకు సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటుచేశారు. విద్యుత్ ఉత్పత్తి బాగానే ఉంది. ఒకసారి బిల్లు వచ్చిన తరువాత మాకు దీనిపై పూర్తిస్థాయిలో ఒక అవగాహన వస్తుంది.

ఒకరిపై ఆధారపడే పనిలేదు



సోమశేఖర్, త్రిపురాంతకం

విద్యుత్ కోసం ఒకరిపై ఆధారపడే పనిలేదు. ఈ పథకం వినియోగించుకుంటే మన ఇంటిలోనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. 3 కిలోవాట్స్ కోసం నేను సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకున్నాను. నెల రోజులుగా విద్యుత్ వినియోగించుకుంటున్నాను. బిల్లు జనరేట్ అయిన తరువాత దీనిద్వారా జరిగే లబ్ధిని ప్రత్యక్షంగా వివరించగలను. ప్రజలకు ఇది ఎంతో ఉపయోగం.

ఏక దంతాయనమః

ఊరంతా ఒక్కటై.. గణపతి నవరాత్రి ఉత్సవాలు

27 ఏళ్లుగా ఒమ్మెవరంలో గ్రామస్థులు

ఐక్యంగా చవితి వేడుకల నిర్వహణ


నిమజ్జనం సందర్భంగా గ్రామ యువత

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వచ్చిందంటే ఆ ఊరంతా ఏకమవుతుంటుంది. తొమ్మిది రోజులపాటు ఐక్యంగా ఉత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. పార్టీలు, వర్గాలు, కులాలు, మతాలకు అతీతంగా బొజ్జ గణపయ్యను ఏర్పాటు చేసుకొని పూజిస్తారు. చివరిరోజు గ్రామోత్సవం నిర్వహించి అనంతరం సముద్రంలో నిమజ్జనం చేసేందుకు ఇంటిల్లపాది తరలి వెళతారు. ఇలా ఒక ఏడాదో, లేక పదేళ్లో కాదు.. ఇదే ఆనవాయితీ 27 ఏళ్లగా ఇలా నిర్వహిస్తున్నారు. వివరాల్లోకెళ్తే...

మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో సరిగ్గా 27 ఏళ్ల క్రితం ఒకే ఒక్క వినాయకుడి విగ్రహాన్ని ఊరుమ్మడిగా ఏర్పాటు చేశారు. తొలి ఏడాది నుంచే ఈ వేడుకలను గ్రామస్థులు ఐక్యంగా నిర్వహించడం మొదలుపెట్టారు. ఇక పూజలు, ఉభయాలు ఇవ్వడానికి వంతుల వారీగా విభజించారు. వారి కుటుంబాల ఉభయం రోజున కుటుంబ సభ్యులు అందరు పాల్గొని బొజ్జ గణపయ్యకు పూజలు నిర్వహిస్తారు.

కార్యక్రమాలు ఇలా...

గ్రామంలో తొలిరోజు విగ్రహం అందించిన దాతలు పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత గ్రామంలోని ఇంటి పేరుతో ఉన్న ముఠాల వారీగా పూజలు నిర్వహిస్తారు. వీరితో పాటు రజకులు, నాయీబ్రాహ్మణులు, ఒక రోజు వైశ్యులు, బ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు మరో రోజు యాదవులు, ఉభయదాతలుగా ఉంటూ స్వామి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రధాన సామాజిక వర్గం కమ్మ కులస్తులు ఐదు ముఠాల వారు ఒక్కొక్క రోజు వంతుల వారీగా ఉభయదాతలుగా ఉంటూ వారి వంతు వచ్చిన రోజు ఇంటిల్లపాది స్వామికి ఉభయదాతలుగా పూజలు నిర్వహిస్తారు. చివరి రోజున ఉత్సవం కోసం గ్రామం నుంచి ఉపాధి కోసం వెళ్లిన యువతీ, యువకులు గ్రామానికి చేరుకొంటారు. ఆ రోజు ఉభయదాతలుగా వ్యవహరించి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను జరిపిస్తారు. అనంతరం పెదగంజాం సముద్ర తీరానికి గణపయ్యను తరలించి నిమజ్జనం చేస్తారు.

ఉభయం కోసం పోటీ...

ముఠాల వారీగా ఉభయం ఇచ్చే సమయంలో స్వామికి పిండి వంటలు, స్వీట్లు, సమర్పించడానికి పోటీ పడతారు. తొమ్మిది రోజులపాటు సరాసరిన ప్రతి రోజు తొమ్మిది రకాల పిండి వంటలు ఉండటం గమనార్హం. ఈ వేడుకలకు మొత్తం మీద ఏటా పది లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా. ఇక ఖర్చును కూడా ప్రతి ఇంటి నుంచి చందాల రూపంలో అందిస్తారు. ఒమ్మెవరం గ్రామంలోని వినాయక చవితి ఉత్సవం చుట్టుపక్కల గ్రామాలకు స్ఫూర్తిగా నిలిచింది. ఈ ఏడాది వేలంలో వినాయక లడ్డూను రూ.55 వేలకు దక్కించుకున్నారు.

రైతులను రోడ్డున పడేసిన ప్రభుత్వం

ఒక వైపు ఎరువుల కొరత, ఇంకో వైపు పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు

ఈనెల 9న కర్షకుల సమస్యలపై ఆర్డీవోలకు వినతిపత్రాలు


మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను రోడ్డున పడేసిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. యూరియా కోసం, ఇతర ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలల నుంచి రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నా, ప్రతిపక్ష పార్టీలు పోరాటం చేసినా ఆ సమస్యను పక్కదారి పట్టించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులు సంక్షోభంలో ఉన్న సమయంలో కూడా వ్యవసాయ శాఖ మంత్రి పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను 50శాతం మార్క్‌ఫెడ్‌కు, మిగిలిన 50శాతం ప్రైవేటు వ్యాపారులకు కేటాయిస్తారని, అందుకు భిన్నంగా మార్క్‌ఫెడ్‌కు తక్కువగా కేటాయించారని ఆరోపించారు. ఎరువుల సమస్యలపై ఈనెల 9వ తేదీన ఆర్డీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు, వై వెంకటేశ్వరరావు, వైఎం ప్రసాద్‌రెడ్డి, కేవీ రమణారెడ్డి, కఠారి శంకర్ పాల్గొన్నారు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులో ఉన్న ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో బస్టాండ్‌సెంటర్‌లోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో తనిఖీలను నిర్వహించి స్టాకు రిజిష్టర్, గోడౌన్‌లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. సదరు దుకాణంలో సరైన పత్రాలు లేకుండా 1,81,000 స్టాక్ నిల్వ చేసినట్లుగా తనిఖీల్లో గుర్తించి వాటి అమ్మకాలను నిలిపివేయాలని గ్రోమోర్ సిబ్బందిని ఆదేశించారు. ఎరువులను ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలని సూచించారు. ప్రతిరోజు దుకాణం బయట నిల్వల వివరాలను బోర్డులో ఉంచాలని చెప్పారు. ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరరావు, ఏవో శివనాగప్రసాద్, మండల వ్యవసాయాధికారి వెంకట్రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మనగ్రోమోర్‌లో ఎరువులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రేపు సెపక్‌తక్రా సబ్ జూనియర్స్ జట్ల ఎంపిక

ఒంగోలుకార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ ప్రెసిడెంట్ యనమల సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ఒంగోలులోని ఏబీఎం కాలేజి క్రీడా మైదానం వద్ద హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 13,14 తేదీలలో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని, వివరాలకు సెల్ 9381657774 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం


ఎన్టీఆర్ పార్కులో రిటైర్డ్ అధ్యాపకులను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు, డీఈవో కిరణ్‌కుమార్

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

● పలు సంఘాల ఆధ్వర్యంలో టీచర్లకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్/ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం ఒంగోలు నగరంలో పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవలను కొనియాడారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కమిషనర్, క్లబ్ ప్రతినిధులు


ఎస్ఎస్‌పాడులో అనంతయ్యను సత్కరిస్తున్న వాసవీక్లబ్

- లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటజన్స్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక విందు హోటల్‌లో ప్రముఖ విద్యా సంస్థ కరస్పాండెంట్ నోబుల్ చరియన్ లిజీ, అపెక్స్ స్కూలు కరస్పాండెంట్ శివకోటిరెడ్డిలను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, పూర్వ అధ్యక్షుడు పల్లపు సుబ్బయ్య, తమ్మన ఆంజనేయులు, పబ్బిశెట్టి జనార్దన్, మిరియాల కృష్ణ, గోపి, విజయ్, కిషోర్, అజయ్, సతీష్, బదిరీ, సురేష్, రామ్‌ప్రసాద్, కోడూరి కిషోర్, ప్రసాద్, క్లబ్ కార్యదర్శి లక్ష్మణస్వామి, కోశాధికారి పి.నందకుమార్ పాల్గొన్నారు.



ఒంగోలులో రోటరీ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో గురువులను సన్మానించిన క్లబ్ ప్రతినిధులు

- స్థానిక ఎన్టీఆర్ పార్కులో ఉపాధ్యాయ దినోత్సవం శ్రీచెన్నకేశవస్వామి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నిడమానూరి నాగేశ్వరరావు, కావూరి గణపతి, కుర్రా భాస్కరరావు, కదిరి కొండయ్య, మండవ మురళీకృష్ణ, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

- వైసీపీ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, కఠారి శంకర్, ఎం.వెంకటేశ్వరరావు, బొట్లా సుబ్బారావు, వైఎం.ప్రసాద్‌రెడ్డి, కేవీ.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గురుతరమైందని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 50మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత, గృహ, విద్యారుణాలను త్వరగా మంజూరు చేస్తున్నామని ఆయన చెప్పారు. డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ మార్గనిర్దేశకులను తయారు చేసే ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు, రీజనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్‌బాబు, హరతి, రవికుమార్, హెచ్ఆర్ మేనేజర్ నళినీకాంత్, కె.జానకిరామయ్య, ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ డిప్యూటీ రీజనల్ సెక్రటరీ వి.శ్రీనివాసరావు, జోనల్ సెక్రటరీ సీహెచ్.శ్రీనివాసరావు, ఎంఈవోలు టి.కిషోర్‌బాబు, తన్నీరు బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

- రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రెడ్డి హాస్టల్‌లో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. టీచర్లను సన్మానించారు. హాస్టల్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కేవీ.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం స్థానిక ట్రినిటీ స్కూలులో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర హాజరైన కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు వలేటి రవీంద్ర 30మంది గురువులను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అద్దంకి శ్రీనివాసరావు, కోశాధికారి ప్రసన్నకుమార్, విష్ణువర్ధన్, సురేష్ పాల్గొన్నారు.

- రోటరీ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక గౌతమి మోడల్ స్కూలులో 17మంది గురువులను సన్మానించారు. ముఖ్య అతిథిగా మద్దినేని నాగేంద్రప్రసాద్ హాజరు కాగా, క్లబ్ అధ్యక్షుడు రావిపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ కల్లూరి శ్రీనివాస్‌చౌదరి, కోశాధికారి ఆర్ల శ్రీరామమూర్తి, సీనియర్ ప్రతినిధులు బండారు లక్ష్మీనారాయణ, మండవ నాగేశ్వరరావు, సురేంద్రబాబు, సుధాకర్, రమణ, హరిబాబు, గౌతమ్ కొండయ్య పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..


ఉప్పుగుండూరులో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులోని వివేకానంద సేవా సమితి కార్యాలయం వద్ద ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. వాసవీ జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో యోగా గురువు కామిశెట్టి శంకరరావు, కేఎస్ఆర్ మాస్టార్‌లను సన్మానించారు. క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ అడ్మినిస్ట్రేషన్ ఉపాధ్యక్షుడు అమరా వెంకటసుబ్బారావు, సభ్యులు ఆత్మకూరి వాసు, అమరా రాజేంద్ర, పల్లపోతు నాగేశ్వరరావు, తేలప్రోలు శ్రీరాములు, టీడీపీ నాయకుడు కనగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- ఉపాధ్యాయ దినోత్సవం, కేసీగుప్తా జయంతి వారోత్సవాను ఉప్పుగుండూరులోని వాసవీ కళ్యాణ మండపం వద్ద నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గాదంశెట్టి శ్రీనివాసులు, కనమర్లపూడి సావిత్రి, గుమ్మడి నరేష్, మాగులూరి మాధవీలత, అమరా సత్యనారాయణ, గొల్ల వెంకటరామకృష్ణ కిషోర్, అనూషలను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, అమరా వేణు, పులకణం రాజా, కొంజేటి జలంధర్, దేసు రవిసుధాకర్, టీజేవీ.ప్రసాద్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో

సంతనూతలపాడు: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం సంతనూతలపాడులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కె.అనంతయ్యను సత్కరించారు. వాసవీక్లబ్, మహిళాక్లబ్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు కేసీగుప్తా జయంతి వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా సహాయకార్యదర్శి వి.నాగేంద్రప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కొండపి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని పలువురిని ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ సభలో ఘనంగా సన్మానించారు. వీరిలో తాటాకులపాలెం (ఎంపీయూపీఎస్) ఎస్‌జీటీ ఎన్.భూలక్ష్మి, చోడవరం ఎంపీపీఎస్ ఎస్‌జీటీ కె.కోటేశ్వరరావు, కె.ఉప్పలపాడు జడ్పీస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ.రవికిరణ్‌కుమార్, నెన్నూరుపాడు ఎంపీయూపీఎస్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు తంగెళ్ల శ్రీనివాసప్రసాద్ ఉన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు



నిమజ్జనానికి బయల్దేరిన గణనాథులు

పొన్నలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి నుంచి తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న గణనాథులను శుక్రవారం నిమజ్జనం చేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన మండపాలలోని గణపయ్యకు తొలుత విశేష పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు రంగులు చల్లుకుంటూ మేళతాళాలు, బాణ సంచా మోతల మధ్య పాకలకు తరలించారు. అక్కడ సముద్రంలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై అనూక్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇలవరలో..

కొండపి: మండలంలోని ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో టీడీపీ నాయకుడు గోనుగుంట పున్నయ్యచౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పున్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా ఓనమ్


వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఉన్న మళయాల ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే ఓనమ్ సంబరాలను ఒంగోలులో ఘనంగా జరిగాయి. శుక్రవారం స్థానిక మాంటిస్సోరి స్కూలులో యాజమాన్యం, ఉపాధ్యాయులు వేడుకలు నిర్వహించారు. ఓనమ్ పండగ గొప్పతనం తెలియజేశారు. ఈ సందర్భంగా ఓనమ్ విందు పన్నెండు రకాల వంటలతో భోజనం (సద్య)ను భుజించారు. కేరళ సం ప్రదాయ దుస్తులను ధరించారు. కార్యక్రమంలో మాంటిస్సోరి ప్రకాష్‌బాబు, డైరెక్టర్ బదరీనాథ్, ఈషా, వైష్ణవినాయర్, నిషాంత్ నాయర్, రితవ్ కమలా క్షమ్మ తదితరులు పాల్గొన్నారు

ఆక్వా రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటరావు

కొత్తపట్నం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అమెరికా విధించిన సుంకాల నేపథ్యంలో ఆక్వా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్కెట్ సౌకర్యం కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం నాయకులు కొత్తపట్నం ప్రాంతంలోని రొయ్యల చెరువులను పరిశీలించారు. ఆక్వా రైతులతో మాట్లాడారు. దేశం నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తులపై అమెరికా 50 శాతం టారీఫ్ కారణంగా రాష్ట్ర ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోనున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని రెండున్నర లక్షల మంది ఆక్వా రైతులపై ఈ ప్రభావం పడుతుందన్నారు. ఆక్వా రైతుల ఇబ్బందులపై చర్చించేందుకు ఈనెల 8వ తేదీన రొయ్యల ఎగుమతులపై ఆ మెరికా ఆంక్షలు- ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై ఒంగోలులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆక్వా రైతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి స్వామిరెడ్డి, పి.హనుమంతరావు, కె.శ్రీరాములు పాల్గొన్నారు.

ఐక్యంగా సమరశీల పోరాటాలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాల నినాదంతో దేశంలోని సమరశీల పోరాటాల్లో సీఐటీయూ అగ్రభాగాన ఉందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ నగర మహాసభ జరిగింది. ముందుగా జెండాను దామా శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని దేశంలో ఎదిరించిన ఏకైక ట్రేడ్ యూనియన్‌గా నిలిచిందని చెప్పారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, టి.మహేష్, కె.శ్రీనివాసరావు, సుజాత, ఎండీ.యాసిన్, కేవీ.సుబ్బమ్మ, విజయమ్మ, నరసింహ, వెంకట్రావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయా అర్జీలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలతో బస్సు ప్రయాణం

తెలుగుమహిళలు, మహిళా ప్రయాణికులతో కలిసి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ప్రయాణించారు. ఒంగోలు నుంచి మంగమూరు, కామేపల్లివారిపాలెం, సంతనూతలపాడు, పి.గుడిపాడు, బోడపాలెం మీదుగా చీమకుర్తి మండలం ఏలూరివారిపాలెం గ్రామం వరకు ఎమ్మెల్యే విజయకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు, ఆర్టీసీ అధికారులు వెళ్లారు.

పట్టణ సమస్యలపై వినతి

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాంటూ అణగారిన కులాల ఐక్యవేదిక(జేఏసీ) నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పేద ప్రజలకు నివాస స్థలాలు మంజూరు చేయాలని, రామతీర్థం జలాశయం నుంచి పట్టణ ప్రజలకు నేరుగా ఇంటింటికి తాగునీరు అందించాలని కోరారు. బీసీ బాలుర, బాలికల హాస్టల్ విద్యార్థులకు శాశ్వత భవనాలు నిర్మించాలని, పట్టణంలో పబ్లిక్ పార్కును ఏర్పాటు చేయాలని, గిరిజన గురుకుల పాఠశాకు శాశ్వతప్రాతిపదికన ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌బాష, బండ్ల కొండలరావు, దగ్గు సిద్ధయ్య, షేక్ జంషీర్, అత్యాల దావీదు, పాలపర్తి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటా!

● రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకల్యాణ చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా పార్టీ పదవి చేపట్టిన సూర్యకళ్యాణ్ చక్రవర్తిని జిల్లా బీజేపీ నేతలు భారీ గజమాల, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవన్, సంఘటన్ మంత్రి మధుకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు వచ్చిన పదవి పెద్ద బాధ్యతని, దానిని సక్రమంగా నిర్వర్తించేందుకు అందరిని కలుపుకుని పోతానని చెప్పారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా దానిని తీర్చేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పార్టీ అధిష్ఠానంతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, ముఖ్యనాయకులు సూర్యకళ్యాణ్‌చక్రవర్తిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.నర్సింగరావు, బొద్దులూరి ఆంజనేయులు, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ కరస్పాండెంట్ సీవీ.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, డాక్టర్ జేవీ.నారాయణ, అశోక్‌రెడ్డి, అమరసింహం, తోగంటి శ్రీనివాసులు, యోగయ్యయాదవ్, బోడపాటి బ్రహ్మయ్య, ఎం.శ్రీనివాసరావు, కావూరి వాసు, నాయకులు పాల్గొన్నారు.


సూర్యకల్యాణ్‌చక్రవర్తిని సత్కరిస్తున్న నాయకులు

గణేషుడికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న నిర్వహణ కమిటీ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కుట్టుబోయినపాలెంలో గణేషుడి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం విఘ్నేశ్వరుడికి విశేష పూజలు చేశారు. భక్తులకు కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణయాదవ్ ఫ్రెండ్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కుట్టుబోయిన కోటియాదవ్, ఉపాధ్యక్షులు తుమ్మకూర హనుమంతరావు, ప్రధానకార్యదర్శి కుటుంబం వెంకటసుబ్బయ్య, ఒంటోలు సాయికృష్ణ, అజయ్, అభినయ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి

మద్దిపాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద జరిగింది. నాగులుప్పలపాడు మండలం కొత్తకోటకు చెందిన నాగినేని ఆంజనేయులు(60) మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొంది. దీంతో ఆంజనేయులు అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే స్థానికులు ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మద్దిపాడు ఎస్ఐ జి.సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అంధకారంలో వైద్యశాల ప్రాంగణం

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణం నాలుగు రోజుల నుంచి అంధకారంలో ఉంది. ఆసుపత్రి పైభాగాన ఉన్న లైట్లు వెలగకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ చెట్లు ఉండటంతో పాములు, విషపురుగులు ఉంటాయేమోనని భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రేపు చంద్రగ్రహణం.. ఆలయాల మూసివేత

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వల్లూరమ్మ ఆలయం మూసివేస్తున్నట్లు ఈవో బి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆయన తెలిపారు. కామేపల్లి పోలేరమ్మ ఆలయంలో కూడా ఆదివారం మధ్యాహ్నం నుంచి దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఈవో భైరాగిచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల తర్వాత ఆలయాన్ని తెరుస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముప్పవరం ఫీడర్ పరిధిలోని ముప్పవరం, చోడవరం, వెన్నూరు గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పువ్వాడి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఈ అంతరాయం ఏర్పడుతున్నదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

9న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ఈనెల 9వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి బోటనీ, పొలిటికల్ సైన్స్, కామర్స్, ఫిజికల్‌ఎడ్యుకేషన్ సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం


వెంకట్రావును సత్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాచగర్ల వెంకట్రావును జిల్లా యాదవ జేఏసీ నాయకులు సత్కరించారు. శుక్రవారం ఒంగోలులోని వెంకట్రావు నివాసంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ళ గోపీకృష్ణలు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలు ఏఎంసీ చైర్మన్ పదవిని యాదవ సామాజిక వర్గానికి చెందిన వెంకట్రావుకు కేటాయించడం పట్ల ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీచర్ల ప్రమోషన్ల సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కోర్టు వివాదాలతో ఆగిపోయిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్ల ప్రమోషన్ల సమస్యలను పరిష్కరించాలని ఆ టీచర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నయ్య కోరారు. శుక్రవారం ఒంగోలులోని ఏపీటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల పాఠశాలలను ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించి ఉదయం 7.45నుంచి 8.45 వరకు స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆయన కోరారు. ప్రభుత్వం పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య, శాంతారామ్, అప్పయ్య, శ్రీనివాసులు, వంశీకృష్ణ, బ్రహ్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బొమ్మరిల్లులో స్వీట్లు, పండ్లు పంపిణీ


పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

ఒంగోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్-ఉన్-నబీ హజ్రత్ మొహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని బొమ్మరిల్లు అనాథ పిల్లల ఆశ్రమంలో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త చూపిన మార్గం యావత్ ప్రచంచానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు, నిర్వహకులు షేక్ ఖాసీం, నత్తల శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

వద్దిపాడు, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని మహిళకు గాయాలైన సంఘటన శుక్రవారం గుండ్లాపల్లి ఫ్లైఓవర్ వంతెనపై జరిగింది. ముప్పవరం గ్రామానికి చెందిన రమాదేవి తన ద్విచక్ర వాహనంపై ఒంగోలు నుంచి స్వగ్రామం వెళుతుండగా అదుపుతప్పి కిందపడింది. దీంతో రమాదేవికి తీవ్రగాయాలు కాగా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

మదర్‌తెరిసాకు నివాళి

మద్దిపాడు, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో శుక్రవారం మదర్‌తెరిసా వర్ధంతి కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ జజ్జర శరత్‌బాబు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. మదర్‌తెరిసా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎ.కోటేశ్వరరావు, గంటా కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, దేవరశెట్టి యల్లమంద, నేలటూరి సత్యనారాయణ, పాటిబండ్ల వెంకటసుబ్బయ్య, బడితల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్పొరేటర్ల గుజరాత్ టూర్..!

● 10న బాలినేని ఆధ్వర్యంలో విహారయాత్ర

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థలోని జనసేన కార్పరేటర్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో విహారయాత్రకు సిద్ధమయ్యారు. ఈనెల 10 నుంచి 16వతేదీ వరకు గుజరాత్‌లోని ప్రముఖ ఆలయాలను సందర్శించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రయాణ ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఒంగోలు నుంచి ట్రైన్‌లో చెన్నై చేరుకుని, అక్కడ నుంచి విమానంలో అహ్మదాబాద్ చేరుకుంటారు. అక్కడే ఏడు పగళ్లు, ఆరు రాత్రులు ఉండేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.

సింగయ్యకు సత్కారం

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నేత వేల్పుల సింగయ్యను శుక్రవారం ఆపార్టీ నేతలు అభినందించారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లోని ఆయన నివాసం వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సింగయ్య, ఆయన సతీమణి అయిన మాజీ సర్పంచ్ కోటేశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కూనపరెడ్డి సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ హైమావతి, టీడీపీ నేతలు యస్థాని, కాక శ్రీనివాసులు, యానాది, సుబ్బారావు, రవిశంకర్‌రెడ్డి, మేకల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు ప్రొఫెసర్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రాధిక

సంతనూతలపాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడుకు చెందిన రాధిక డాక్టరేట్ సాధించారు. గ్రామానికి చెందిన గ్రందె కృష్ణమూర్తి, రమాదేవిల కుమార్తె రాధిక హైదరాబాద్‌లో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆమె భౌతికశాస్త్రంలో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని గీతం యూనివర్శిటీ ప్రాంగణంలో వైజాగ్ ఎంపీ ఎం.శ్రీభరత్ చేతులమీదుగా రాధిక అవార్డును స్వీకరించారు. పలువురు ప్రముఖులు రాధికకు అభినందనలు తెలిపారు.

గణపతి లడ్డూ రూ.1.55లక్షలు


41 కేజీల లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బి.నిడమానూరు గ్రామంలోని ఉత్తరం బజారు రాముల వారి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నవరాత్రి పూజల అనంతరం శుక్రవారం స్వామి వారి లడ్డూలను వేలం నిర్వహించారు. 41 కిలోల లడ్డూను నలమలపు శ్రీనివాసరెడ్డి రూ.1,55,001లకు, 17 కిలోల లడ్డూను కుంతూరి చంద్రనారాయణరెడ్డి రూ.47వేలకు, 6 కిలోల లడ్డూను సన్నపురెడ్డి నారపరెడ్డి రూ.38,116లకు దక్కించుకున్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుండ్లకమ్మ నది తీరాన వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని అర్చకులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లను శోభాయమానంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెక్కా మాలకొండ నరసింహారావు, కోశాధికారి ఊటుకూరి రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

కంభంలో కన్నుల పండువగా..


కంభంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

కంభం : శ్రవణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం కంభం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువలా జరిగింది. స్వామివారి కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జగదాంబకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ శర్మలు అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురి చేయవద్దు

రాచర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురి చేయవద్దని రాచర్ల ఎస్సై పి. కోటేశ్వరరావు పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. రాచర్ల గురుకుల పాఠశాల వద్ద శుక్రవారం ఆయన తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇరువురు చిన్నారులు వాహనాలు నడుపుతూ వారికి పట్టుబడడంతో ఆయన తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని చదువుకునే పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి వెనకాలే తల్లిదండ్రులు కూర్చొని వారితో డ్రైవింగ్ చేపించడం సమంజసం కాదని ఆయన అన్నారు. జరగరాని ప్రమాదాలు జరిగితే ఆ తర్వాత ఎంత ఆవేదన చెందినా ప్రయోజనం ఉండదన్నారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా తిరిగే వాహనాలకు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.


సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న రామసుబ్బయ్య

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు

- సంజీవరాయునిపేట సొసైటీ చైర్మన్ రామసుబ్బయ్య

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కష్టపడిన ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సంజీవరాయునిపేట సొసైటీ చైర్మన్‌గా ముచ్చుకుంట్ల రామసుబ్బయ్యను నియమించగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు మెంబర్‌గా సంగన ప్రతాప్‌రెడ్డి కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కృష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని, కార్యకర్తకు ప్రాధాన్యత ఇస్తూ వారి సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆ కోవలోనే పార్టీ నాయకులు రామసుబ్బయ్యకు సొసైటీ బ్యాంక్ చైర్మన్ పదవి రావడం నిదర్శనమన్నారు.

కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్‌పీటీసీ బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు నంది శ్రీను, కడియం శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో వినూత్న పద్ధతిలో బోధన

కేంద్రాలకు చేరుకున్న నవ చేతన, ఆధార్ శిల పుస్తకాలు
బోధన అందిస్తున్న కార్యకర్తలు


అయ్యంబొట్లపల్లిలో విద్యను బోధిస్తున్న కార్యకర్త

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కూటమిప్రభుత్వం వినూత్న పద్ధతులను అమలు చేస్తోంది. చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు నవ చేతన, ఆధార్ శిల అను రెండు రకాల పుస్తకాలను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది. ఇప్పటికే పోషకాహారం అందజేత పర్యవేక్షణ యాప్‌లు అమలు చేసింది. అందులో భాగంగా ఎర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు ఇప్పటికే ఆయా రకాల పుస్తకాలను సరఫరా చేశారు అధికారులు. ప్రాజెక్టు పరిధిలో ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలు ఉన్నాయి. మొత్తం 248 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 221 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు కాగా 27 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 215 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 217 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులు 26,798, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 5,459 ఉన్నారు. గర్భిణులు 1,186, బాలింతలు 989 ఉన్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

ప్రతిభనుపంచే దిశగా అడుగులు

ప్రభుత్వం చిన్నారులకు ఉపయోగపడే పాఠ్యపుస్తకాలను బొమ్మల రూపంలో ముద్రించి ప్రతి కేంద్రానికి పంపిణీ చేసింది. దీంతో (మూడు నుంచి ఆరేళ్ల లోపు) చిన్నారుల్లోని ప్రతిభ పెంచే అవకాశం ఉంటుందని కార్యకర్తలు చెబుతున్నారు. వీటిని ఏలా చిన్నారుల తల్లి దండ్రులకు, కార్యకర్తలకు బోధించాలనే విషయాలపై ఇప్పటికే అవగాహన కల్పించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో హేమలత భాస్కర్ తెలిపారు. అన్ని కేంద్రాలలో ఈ బోధన జరుపుతున్నట్లు ఆమె తెలిపారు. కొత్త రకాల బోధన రావడంతో ఇటు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారని వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్లు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సన్మానం


సింగంపల్లిలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మహిళలు

గిద్దలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వివిధ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సింగంపల్లి గ్రామంలో ఉపాధ్యాయురాలు ఓబులమ్మను తల్లులు ఘనంగా సన్మానించారు. విద్యాకమిటీ ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు శ్రీనివాసశర్మ, వెంకటేశ్వర్లును యూనియన్ నాయకులు సన్మానించారు. జోనల్ కన్వీనర్ సుబ్బరాయుడు, రాష్ట్ర మాజీ కార్యదర్శి మూర్తయ్య, గిద్దలూరు, రాచర్ల మండలాల యూనియన్ నాయకులు పాల్గొన్నారు. స్ప్రింగ్ బోర్డు పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కరస్పాండెంట్ డాక్టర్ జె.వి.నారాయణ, డైరెక్టర్ చైతన్య, ప్రిన్సిపాల్ శ్వేత, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుద్దప్రసాద్

ఉపాధ్యాయుడు రఫీకి సత్కారం

తర్లుపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ మండలి వెంకట కృష్ణారావు జయంత్యుత్సవాల్లో భాగంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ రామ్మోహన్ గ్రంథాలయంలో నిర్వహించిన గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తర్లుపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎస్ఎండీ రఫీకి శత జయంతి సాహిత్య సత్కారంను అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్దప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రఫీకి సాహితీ సత్కారం అవార్డు అందుకోవటం పట్ల పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సర్వేపల్లి చిత్రపటానికి నివాళి

మార్కాపురం వన్‌టౌన్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ రంగయ్య, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితాన్ని జీవితం ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

11 మంది ఉత్తమ ప్రయివేటు ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఎర్రగొండపాలెం: గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో వివిధ ప్రయివేటు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 11 మంది ఉత్తమ ప్రయివేటు ఉపాధ్యాయులను పూలమాలలు వేసి,దుశ్శాలువాలతో ఎంఈవో పి.ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రయివేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు నానా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముందుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ గోళ్ల వీర వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎంఐ ప్రసాదు, దంపతులను సన్మానించారు.


ఎర్రగొండపాలెంలో ఎంఈవో ఆంజనేయులు నుంచి సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు


కొమరోలులో సన్మానం పొందిన గురువులు

జీవితాన్ని నేర్పేవారే గురువులు

కొమరోలు : ప్రతి వ్యక్తి జీవితాన్ని నేర్పేవారే చదువు చెప్పిన గురువులేనని ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నం అన్నారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండల ఉత్తమ గురువులుగా ఎంపికైన గౌరిపెద్ది సౌమిత్రి, గౌరిపెద్ది శ్రీధర్‌శర్మ, సముద్రాల బ్రహ్మయ్య, రాజు, దామోదర్‌రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలతో పాటు కాంప్లెక్స్ చైర్మన్లు శివనాగేశ్వరరావు, చంద్రశేఖర్, పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న చిన్నకంభం ఉపాధ్యాయుడు


మార్కాపురంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కంభం : మండలంలోని చిన్నకంభం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బూదాల నాజీర్ సురేష్ బాబు శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని స్పందన మీటింగ్ హాలులో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్,మేయర్ సుజాత, డీఈవో కిరణ్ కుమార్‌ల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

గిద్దలూరు టౌన్ : ఉపాధ్యాయులు క్రమశిక్షణ గల విద్యతో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎన్‌జీవో సంఘం నాయకులు గొటికె రవీంద్రరెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విశ్వభారతి పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్యను మెమెంటో, శాలువతో సన్మానించారు.



గిద్దలూరులో హిందీ ఉపాధ్యాయుడు పిచ్చయ్యను సన్మానిస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

టీడీపీ నేత మాతృమూర్తికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పరామర్శ


శ్రీనివాసరావు తల్లిని పరామర్శిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

కంభం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పట్టణంలోని సంఘమిత్ర వైద్యశాలలో కంభం మండల టీడీపీ అధ్యక్షుడు తోట వెంకట శ్రీనివాసరావు మాతృమూర్తి వెంకట లక్ష్మీదేవీ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. వైద్యులను అడిగి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరలోనే మీరు కోలుకుంటారని, అధైర్యపడొద్దని వెంకట లక్ష్మీదేవీకి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు రామాపురానికి ఎమ్మెల్యే ముత్తుముల

రాచర్ల : గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నేడు రాచర్లలోని రామాపురానికి రానున్నారని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద్ శుక్రవారం తెలిపారు. రామాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్ ప్రమాణ స్వీకారం శనివారం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

గిద్దలూరు టౌన్ : ఖురాన్ సృష్టికర్త నబి కరీం పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, మానసిక వికలాంగుల పాఠశాల, వృద్ధాశ్రమంలో టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఖాజీనాయబ్‌రసూల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షానేషావలి, అహమ్మద్‌బాషా, హజరత్ దూదేకుల, నాయబ్‌ఖాజా, ఖాద్రి, షేక్ రియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయక నిమజ్జనం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని కోనేటి బజారులోని మట్టి వినాయకుని విగ్రహానికి భక్తులు ఇళ్ల నుంచి నీళ్లు తెచ్చి నిమజ్జనం చేశారు. వివిధ మండపాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గణనాథుడికి వీడ్కోలు

ఎర్రగొండపాలెం: పుల్లలచెరువు సెంటరులో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశునికి విశేషపూజలు చేశారు. అనంతరం శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పుల్లలచెరువు సెంటరునుంచి ట్రాక్టరుపై బయలు దేరిన గణనాథుడినిత త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద సాగర్ కాల్వలో నిమజ్జనంకు తరలించారు.


నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొండారెడ్డి

కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయూ పట్టణ 12వ మహాసభ శుక్రవారం జరిగింది. తొలుత సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాసేందుకు 4 లేబర్ కోడ్స్ తీసుకొస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల కాలంలో వేతనాలు పెంచలేదన్నారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.సుబ్బరాయుడు, ఎం.లక్ష్మీ, డీకేఎం రఫి, సోమయ్య, బాలనాగయ్య, రూబెన్, చెన్నకేశవులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వొద్దుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలి

పొదిలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈయూ జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఏ బాజీ అధ్యక్షతన జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిపోలో యూనియన్ పరంగా కార్మికులకు, ఉద్యోగులకు ఉన్న సమస్యలను పోరాడి సాధించుకోవాలని సూచించారు. అదేవిధంగా నూతన కమిటీని ఎన్నుకోవాలనే ప్రతిపాదన చేయగా పాతకమిటీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తుందని, అదేకమిటీని కొనసాగిస్తున్నామని చెప్పారు. డిపోలో ఉన్న సమస్యలపై డీఎంకు మెమోరాండం ఇవ్వాలని కమిటీ తీర్మానించినట్లు చెప్పారు. అనంతరం ఎంఎంయూఏ యూనియన్ నుంచి ఏఎస్ రావ్, టీకే రావ్, ఎస్ శ్రీనులు ఈయూ యూనియన్‌లో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ సెక్రెటరీ రవి, రాష్ట్ర మెయింటెనెన్స్ కమిటీ మెంబరు పి. కొండలరావ్, జిల్లా జాయిట్ సెక్రెటరి శేఖర్‌నాయుడు, జిల్లా నాయకులు కె రామకృష్ణ, డీసీహెచ్ అంజయ్య, కె. వెంకట్రావు, డిపో సెక్రెటరి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


అటవీ ప్రాంతంలో బోల్తా పడిన టెంపో వాహనం

నల్లమల ఘాట్‌లో వాహనం బోల్తా

- పలువురికి స్వల్ప గాయాలు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):వేగం అదుపు తప్పి టెంపో వాహనం బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలోని చింతల సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. తెలిసిన సమాచారం ప్రకారం కర్ణాటక నుంచి శ్రీశైలం దైవ దర్శనం కోసం వెళ్తుండగా చింతల మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి వేగం అదుపు తప్పి పక్కనే ఉన్న కొండ వైపు బోల్తా పడింది.వాహనంలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ వాహనంలో క్షతగాత్రులను శ్రీశైలం ప్రాజెక్టు సుండిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించినట్లు సమాచారం.


నగదు అందజేస్తున్న బోనేని వెంకటేశ్వర్లు

నిరుపేద కుటుంబానికి 'బోనేని' చేయూత

కొమరోలు, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): నిరుపేద ఎస్సీ కుటుంబానికి అమ్మా ఫౌండేషన్ నిర్వాహకులు బోనేని వెంకటేశ్వర్లు ఆర్థిక చేయూతనిచ్చారు. కొమరోలు మండలంలోని తాటిచర్ల గ్రామ ఎస్సీ పాలెంకు చెందిన కూకట్ల భూపాల్ గతనెలలో కూలీపని ముగించుకుని ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయింది. దీంతో జీవనం గడిపేందుకు ఆ కుటుంబం ఇబ్బందులు పడుతున్నదని తెలుసుకున్న అమ్మా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరి కుటుంబాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సహకారంతో అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పందరబోయిన భూపాల్, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ నాయకురాళ్లు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

గిద్దలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 20, 21 తేదీలలో ఒంగోలులో జరిగే మహాసభల వివరాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు స్వర్ణకుమారి, కార్యదర్శి విజయ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సెలవురోజుల్లో ఈతకు వెళ్లవద్దు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సగిలేరు, ఇతర వాగులు, వంకలలో నీరు ప్రవహిస్తుండడంతో విద్యార్థులు, చిన్నారులు ఆప్రాంతాలకు వెళ్లరాదని అర్బన్ సీఐ కె.సురేష్ అన్నారు. ప్రస్తుతం వాగుల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, నీటిగుండాలు కూడా ఉన్నాయని పిల్లలు ఎవరూ సరదాగా ఈతకు వెళ్లవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనించాలన్నారు.

ఐదేళ్లుగా నిలిచిన పథకాలకు మోక్షం

దర్శిలో శరవేగంతో జరుగుతున్న అభివృద్ధి పనులు



దర్శిలో జరుగుతున్న టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం



తాళ్లూరు మండలంలో జరుగుతున్న 133/32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

దర్శి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పథకాల నిర్మాణం పనులు శరవేగంతో జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పనులు 90 శాతం పూర్తికాగా, మరికొన్ని పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత వైసీపీ పాలకుల నిర్వాకంతో అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పథకాలు పునాదుల్లోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించిన విషయం తెలిసిందే.

దర్శి పట్టణంలో రూ.60 లక్షలతో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన అన్నా క్యాంటీన్ నిర్మాణం సగం పూర్తయ్యేసరికి 2019లో ఎన్నికలు వచ్చాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అన్నా క్యాంటీన్ గురించి పట్టించుకోలేదు. చిల్లచెట్లు మొలచి అధ్వానంగా మారింది. అలాగే, దర్శి - తూర్పుగంగవరం రోడ్డులో రూ.2 కోట్లతో గత వైసీపీ ప్రభుత్వంలో ఆరంభించిన టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం శంకుస్థాపనకు పరిమితమైంది. దర్శి పట్టణ ప్రముఖులు కల్యాణ మండపానికి అవసరమైన డిపాజిట్ నిధులు కూడా సమకూర్చారు. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేయటమే తప్ప నిర్మాణం గురించి పట్టించుకోలేదు.

పూర్తికానున్న 'మొగిలిగుండాల'

తాళ్లూరు మండలం శివరాంపురం వద్ద గత టీడీపీ ప్రభుత్వంలో మొగలిగుండాల రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. పనులు ప్రారంభం సమయానికి 2019 ఎన్నికలు రావటంతో అర్ధంతరంగా ఆగాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండర్ల ప్రక్రియలోనే రెండువర్గాల మధ్య వివాదాలు తలెత్తడంతో మూలనపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులన్నీ ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.7.96 కోట్లతో నిర్మిస్తున్న మొగలిగుండాల రిజర్వాయర్ పనులు 90శాతం పూర్తయ్యాయి. 475 మీటర్ల పొడవుగల కట్టను నిర్మించి నల్లకొండకు అనుసంధానం చేశారు. ఈరిజర్వాయర్ పూర్తయితే కొండ ప్రాంతంలో నీరు వచ్చి చేరుతుంది. ఆప్రాంతంలో భూగర్భజలాలు పెరిగి నీటికొరత తీరుతుంది. తాళ్లూరు మండలంలో బోర్ల కింద అధికంగా సాగుచేస్తారు. దీంతో ఈప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. రూ.20 కోట్లతో నిర్మిస్తున్న 133/32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఈ పథకం పూర్తయితే తాళ్లూరు, చీమకుర్తి, అద్దంకి మండలాల్లోని 60 గ్రామాలకు నాణ్యమైన కరెంట్ అందించే వీలు కల్గుతుంది. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంట్ ఇబ్బంది లేకుండా సరఫరా చేసే వీలుకల్గుతుంది.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి గ్రీన్‌సిగ్నల్

దర్శి పట్టణంలో మధ్యలో నిలిచిపోయిన జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ పరిశోధన కేంద్రం పునర్నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది రూ.26 కోట్లతో పనులు ప్రారంభించేందుకు అధికారులు అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. త్వరలో నిధులు విడుదలయ్యేందుకు రంగం సిద్ధమవుతుంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నిలిచిపోయిన అభివృద్ధి పథకాలను పునఃప్రారంభించేందుకు నిరంతరం కృషి చేశారు. ఎన్నోసార్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు సంబంధిత మంత్రులను, రాష్ట్రస్థాయి అధికారులను కలిసి ఈపథకాల అమలుకు ఆమె చేసిన కృషి ఫలించింది. ఈ పథకాలన్నీ పూర్తయితే దర్శి నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.



శంకరాపురంలో వినాయకుడి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

నిమజ్జనానికి తరలిన గణనాథులు

ముండ్లమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు, శంకరాపురం గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను శుక్రవారం సాయంత్రం నిమజ్జనానికి తరలించినక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. అనంతరం నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణ స్వామి, బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, గూడాల సాంబశివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పసుపుగల్లులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.కమలాకర్ భారీ బందోబస్తు నిర్వహించారు.

దొనకొండ: వినాయక చవితి వేడుకల సందర్భంగా దొనకొండలోని రామాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథునికి శుక్రవారం నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. గణనాథున్ని ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళ్ల హనుమంతు నేతృత్వంలో యువకులు నిమజ్జనానికి తరలించారు.

తాళ్లూరు: మండలంలోని తాళ్లూరు, కొత్తపాలెం, బొద్దికూరపాడు, రామాలయం సెంటర్‌లలో కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. గ్రామోత్సవాలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

టీడీపీలో చేరికలు



టీడీపీ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని చింతపూడు, చెన్నపునాయునిపల్లి గ్రామాల నుంచి వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. చింతపూడు గ్రామ సర్పంచ్ ముప్పాళ్ల సరోజనమ్మ, వసంత రాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గ్రామ టీడీపీ నాయకుడు గుంటి మడుగు శ్రీనివాస్‌వర్మ సమాకారంతో చింతపూడు పంచాయతిలో 16 కుటుంబాలు టీడీపీలో చేరారు. అలాగే, చిన్నపునాయునిపల్లి గ్రామంలో జిల్లా షీప్ సొసైటీ చైర్మన్ టి.గోపి, మాజీ ఎంపీపీ టి.అల్లూరయ్య ఆధ్వర్యంలో 13 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షకురాలికి సన్మానం

తాళ్లూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరం గ్రామానికి చెందిన జనశిక్షణ సంస్థ బ్యూటీషియన్ నైపుణ్య నిపుణురాలు సునీతను నాగంబొట్లపాలెం గ్రామంలో శిక్షణ పొందినవారు శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి నూతన దుస్తులు బహూకరించి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ వృత్తిలో చక్కగా రాణించి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు.


ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలి



ఉద్యోగాలు సాధించినవారిని సత్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో కనిగిరి టీచర్స్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉద్యోగాలు పొందటం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు దాదాపు 400 మంది వరకు ఉత్తమ ర్యాంకులు పొంది ఉద్యోగాలకు ఎంపిక కానున్నట్లు అకాడమి యాజమాన్యం ఎమ్మెల్యేకు తెలిపారు. కనిగిరి ప్రాంత విద్యార్థులు ఉపాధ్యాయ రంగంలో రాణించేలా కృషి చేయాలని అకాడమీ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పి.మాల్యాద్రిరెడ్డి, అధ్యాపక బృందం బాపతు కోటిరెడ్డి, నాగేశ్వరరావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి



ఛానల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న ఐవీ సుబ్బారావు, నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు

దర్శి సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో డీటీవీ న్యూస్ ఛానల్‌ను శుక్రవారం సాయంత్రం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసార సాధనాలు ప్రజలకు అత్యంత చేరువ కావటం ఆనందదాయకమన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలపటంతో పాటు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఛానల్ అధినేత పరమేశ్వర్‌రెడ్డి, సీఐ రామారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన బోడపాటి అనునూయను డాక్టర్ లక్ష్మి సన్మానించి అభినందించారు.

నేడు పామూరు మండల సమావేశం

పామూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పామూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీవో బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

పామూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి రిటైర్ అయిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. వగ్గంపల్లి పాఠశాలలో పనిచేసి రిటైర్ అయిన వారిలో మాజీ ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, షేక్ ముంతాజ్, జి. శ్రీహరి, ఎం.శ్రీనివాసరాజు, హస్తీ వీరాంజనేయులు ఉన్నారు. పట్టణంలోని అక్షర విద్యా సంస్థల ఆధ్వర్యంలో పువ్వాడి రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ కదిరి బాబురంగారావును విద్యార్థులు గజమాలతో సత్కరించారు.

తాళ్లూరు: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత, విశ్రాంత హెచ్‌ఎం ఎస్.అంజిరెడ్డిని గురుపూజోత్సవం సందర్భంగా మానవతా స్వచ్ఛంద సంస్థ శుక్రవారం ఘనంగా సన్మానించారు. దర్శిలోని శ్రీనివాస కల్యాణ మండపంలో సంస్థ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అంజిరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె .రఘురామయ్య, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బసవయ్య, చైర్మన్ దేవత వరప్రసాద్, షేక్ మస్తాన్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కేశవరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కనిగిరిలో జరిగిన వీఆర్‌ఏల సంఘ సమావేశానికి ఏడుకొండలు అధ్యక్షత వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవదానం, కార్యదర్శిగా ఏడుకొండలు, సభ్యులుగా కె.బాలనాగయ్య, బి.కొండయ్య, బారాయిమాం, తదితరులను ఎన్నుకున్నారు.

మార్గదర్శకులు ఉపాధ్యాయులు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం సీఎస్‌పురం మండలంలోని చింతపూడు నాగులారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. సమాజంలో మార్గదర్శకులు అని అన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపికచేసి సత్కరిస్తుందన్నారు.

కార్యక్రమంలో ఎంఈవో రాజాల కొండారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, జీవీఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత గుంటి మడుగు శ్రీనివాసవర్మ, జిల్లా షీప్ సొసైటీ అధ్యక్షుడు తోడేటి గోపి, మాజీ ఎంపీపీ టి.అల్లూరయ్య, సింగిల్‌విండో చైర్మన్ సీహెచ్ వెంకటరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, ఎస్సీ మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీను, సర్పంచ్ పద్మావతి, పాములపాటి నరసయ్య, టి.గురుకృష్ణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

కాగా సీనాగులారం, కోమటి కుంట్ల గ్రామాల్లో రూ.60 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సైడు కాలువలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.మోహన్‌రావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గురుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపల్లిలో తనిఖీలు



రాజంపల్లి సహకార సంఘంలో ఎరువులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార శాఖ అధికారిణి ఇంద్రావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి తదితరులు

దర్శి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లిలో సహకార పరపతి సంఘాలను, స్వయం సహాయక కేంద్రాన్ని శుక్రవారం పలు శాఖల జిల్లా అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా సహకార శాఖ అధికారిణి ఐ.ఇంద్రావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి ఎరువుల నిల్వలు, క్రయ విక్రయాలను పరిశీలించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఎరువు మాయ' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. సొసైటీలకు కేటాయించిన ఎరువులను, విక్రయించిన ఎరువుల వివరాలను, రికార్డులను పరిశీలించారు. ఎరువులను నేరుగా రైతులు విక్రయించారా, బ్లాకులో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారా అనే విషయాలను పరిశీలించారు. రికార్డుల పరిశీలన అనంతరం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేవిధంగా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సొసైటీల రికార్డులు తనిఖీలు చేశామని స్పష్టం చేశారు. ఎవరైన అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ బాలాజీనాయక్, వ్యవసాయాధికారి కె.రాధ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



సింగనపాలెం సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కోయ శివరామకృష్ణ

ముండ్లమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే తమ ధ్యేయమని సింగనపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు కోయ శివరామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయనతోపాటు డైరెక్టర్లుగా ఎంపికైన మందలపు పూర్ణయ్య, కొర్రపాటి హనుమంతరావు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందించటంతో పాటు పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. తనకు సొసైటీ అధ్యక్షుడి పదవి రావడానికి ప్రధాన కారణమైన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతుల సూచనలతో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బత్తిని వెంకటరావు, శివ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడు శ్రీనివాసులును అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

దొనకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మార్కాపురం, కనిగిరి డివిజన్ ప్రధాన కార్యదర్శి మండ్ల శ్రీనివాసులును తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి మండ్ల శ్రీనివాసులు అందించిన కృషికి ఫలితంగానే జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందాడని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహితకు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి యనమల ఆంజనేయులు, డివిజన్ బాధ్యులు ఎస్‌కె హెచ్ రెహమాన్, యు బాలగురువులు, షేక్ రెహ్మతు ల్లా తదితరులు పాల్గొన్నారు.

కాగా, స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్స్‌పాల్ ఎఫ్రాయిమ్(నాని) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా అవార్డు పొందిన మండలంలోని తూర్పుగంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వైఎస్ఆర్‌కే ప్రసాద్‌ను శుక్రవారం ఒంగోలులో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, దామచర్ల సత్య, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జేసీ గోపాలకృష్ణ, డీఆర్‌వో ఓబులేసు, డీఈవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని పొట్లపాడు జనరల్ పాఠశాలలో పనిచేస్తున్న సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలు వళ్లెం స్వాతి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. శుక్రవారం ఒంగోలులో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఈవో కిరణ్‌కుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, దామచర్ల సత్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వైవీ సుబ్బారావు, జి.వెంకటేశ్వర్లు, జె.భారతి ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నారు. ఈసందర్భంగా ఎంఈవోలు జె.ప్రసాదారావు, ఆర్.కొండారెడ్డి వారిని అభినందించారు. యూటీఎఫ్, ఏపీటీఎఫ్ యునియన్ నాయకులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ముండ్లమూరు: మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన డీవీ రమణారెడ్డి, కేవీ శేషమ్మ, విప్రసాదరావును శుక్రవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలేషా వలి, కె.వెంకటేశ్వర్లు, ఎలీషా, కోటేశ్వరరావు, లింగారావు, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లూరు: జిల్లా ఉత్తమ హెచ్‌ఎం అవార్డు అందుకుంటున్న వైఎస్ఆర్‌కే ప్రసాద్



కురిచేడు: ఉత్తమ ఉపాధ్యాయురాలు స్వాతికి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



పామూరు: అవార్డులు అందుకుంటున్న సీఎస్‌పురం మండల ఉపాధ్యాయులు



తురకపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు



◆ తురకపాలెంలో పర్యటిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే రామాంజనేయులు

అంతు చిక్కని మరణాలపై పరీక్షలు

తురకపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం

- నివేదికల తర్వాతే జ్వరాలపై స్పష్టత ఇస్తామన్న నేతలు
- గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- తురకపాలెం మరణాలపై సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అంతు చిక్కని వరుస మరణాలపై వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కూడా గ్రామంలో పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించి వివిధ పరీక్షలకు పంపారు. రక్తనమూనాల పరీక్ష ఫలితాల కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ పరీక్ష ఫలితాలతో.. మరణాలకు కారణమైన సూక్ష్మజీవిని నిగ్గు తేల్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సైతం వేచి ఉన్నారు. గ్రామానికి చెందిన 44 మంది జ్వర బాధితుల నుంచి సేకరించిన రక్తనమూనాలకు గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ ల్యాబోరేటరీలో పరీక్షించగా 9 బ్యాక్టీరియా పాజిటివ్‌గా నివేదికలు వచ్చినట్లు తెలిసింది. కాగా గ్రామానికి చెందిన పీ నరసింహరావు (40) జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, ఆయాసంతో బాధ పడుతూ ప్రైవేటు వైద్యశాలలో చేరగా అతడ్ని పరీక్షించగా మెలియాయిడోసిస్ పాజిటివ్ తేల్చారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తురకపాలెం గ్రామానికి చెందిన ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రబలిన అంతు చిక్కని జ్వరాల నేపథ్యంలో గ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీగా భావించి విధు లు నిర్వహించాలని ముఖ్య మంత్రి చంద్ర బాబు ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు గ్రామంలో పర్యటించారు.

పడిపోయిన పరపతి



60 ఏళ్ల చరిత్రలో అథమ స్థానం

- ఎన్జీ రంగా వర్సిటీకి 31వ ర్యాంకు
- వైసీపీ పాలకుల పాపం.. యూనివర్సిటీకి శాపం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరపతి జాతీయ స్థాయిలో పతనావస్థకు చేరింది. వర్సిటీ 60 ఏళ్ల చరిత్రలో ఎన్నో నూతన ఆవిష్కరణలతో అగ్రస్థానంలో నిలిచి ప్రస్తుతం అథః పాతాళానికి చేరింది. తాజాగా విడుదలైన నేషనల్ ఇనిస్ట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ -2025లో 31వ ర్యాంకుకు పడిపోయింది. రెండేళ్లుగా జాతీయ స్థాయిలో యూనివర్సిటీ ర్యాంకు వరుసగా పడిపోతూనే ఉంది. 2023లో ఎన్ఐఆర్ఎఫ్ సర్వేలో వర్సిటీ 20వ ర్యాంకును, 2024లో 26వ ర్యాంకు సాధించింది. ఈ సంవత్సరం ర్యాంకు మరింత దిగజారింది. జాతీయ స్థాయిలోని వ్యవసాయ అనుబంధ యూనివర్సిటీల్లో అనేక అంశాలను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. ఆ లెక్కన ఈ ఏడాది ఎన్జీ రంగా యూనివర్సిటీకి 100 మార్కులకు కేవలం 49 మార్కులు మాత్రమే దక్కాయి. కీలకమైన అంశాల్లో బాగా వెనుకబడినట్లు ఎన్ఐఆర్ఎఫ్ నివేదిక స్పష్టం చేస్తోంది.

ర్యాంకులే కీలకం..

దేశంలోని అన్ని విశ్వ విద్యాలయాల పనితీరు, అభివృద్ధికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు గీటురాళ్ల వంటివి. వీటి ఆధారంగానే అడ్మిషన్లు, నిధులు, ప్రాజెక్టుల కేటాయింపు ఉంటుంది. ర్యాంకులో వెనకబడితే నిధులు ఇవ్వడానికి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కూడా ఆసక్తి చూపదు. వర్సిటీ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రస్తుతం సాధించిన ర్యాంకు గొడ్డలి పెట్టువంటిదని వర్సిటీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితులో రెండేళ్లగా పెద్ద గా పరిశోధనలకు పెద్దపీట వడలేదన్న ఆరోపణలు విని పిస్తున్నాయి. వర్సిటీలో కొత్త పరిశోధనలు జరగలేదని వాస్తవం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పూర్తిగా తెలుసు. ఈ పరిస్థితుల్లో (మిగతా 6వ పేజీలో)

అన్నీ అటువంటి ఆదేశాలే..

జగన్ ప్రభుత్వంలో నియమితులైన ఇన్‌చార్జి వీసీ నిర్ణయాలు అన్నీ తీవ్ర వివాదాలకు కారణమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న రూ.కోట్ల నిధులను పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులకు కేటాయించకుండా, కేవలం తిరుపతికి మాత్రమే కేటాయించి దుర్వినియోగపరుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆర్థిక కమిటీ లేకుండానే నిధులు కేటాయించడం వంటి వ్యవహారాలు కూడా వివాదాలకు కారణమవుతున్నాయి.



ఎరువులు ఏమవుతున్నాయ్

ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి.

ఇటీవల వరకు వర్షాభావ పరిస్థితుల్లో సాగు సాగ లేదు. ఇటీవల వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అయితే సాగు పనుల్లో నిమగ్నమవ్వాల్సిన రైతులు ఎరువుల కోసం ఎగబడుతున్నారు. అధికారులు పుష్కలంగా యూరియా నిల్వలు ఉంటున్నాయి అంటున్నారు. అయితే ఎక్కడికక్కడ యూరియా అందక రైతులు అల్లాడు తున్నారు. వంద బస్తాలు వచ్చాయంటే పదిం తలుగా రైతులు పోటెత్తు తున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించినా ఒక్క బస్తా కూడా దొరకడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారం పంపిణీ చేసిన యూరియా, ఉన్న నిల్వలకు సాగు అయిన విస్తీర్ణానానికి పొంతనే లేదు. అయితే వచ్చిన యూరియా ఏమైంది.. ఎటు పోయింది.. అనేది తెలియడం లేదు. అధికారులు ఎక్కడి కక్కడ నిఘా, తనిఖీలు టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేసినా ఎరువులు ఏమయ్యాయో ఎక్కడ ఉన్నాయో తెలుసుకోలేక పోతున్నారు. రైతులు మాత్రం యూరియా దొరక్క పాలుపోని పరిస్థితుల్లో చిక్కుకున్నారు.

యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

- సాగు విస్తీర్ణం అంతంతే..
- విపరీతంగా డిమాండ్
- ప్రభుత్వ ప్రకటనలకు.. పొంతనలేని క్షేత్రస్థాయి పరిస్థితులు

(బాపట్ల, రేపల్లె నరసరావుపేట, దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

దాదాపు రెండు వారాలుగా అన్నదాతల యూరియా ఇక్కట్లపై చర్చ జరుగుతూనే ఉంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద క్యూల్లో రైతులు కనిపిస్తున్నారు. యూరియా సమృద్ధిగా ఉందని అధికారులు ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం అయిన దాఖలాలు కనిపించడం లేదు. వరి పైరు ముంపు బారిన పడడం వల్ల రైతులు వెంటవెంటనే యూరియా చల్లాల్సి వచ్చిందని అందుకు తాత్కాలికంగా సమస్య తలెత్తిందని పది రోజుల క్రితం (మిగతా 6వ పేజీలో)



అక్రమ రవాణాపై నిఘా

పొందుగల వద్ద కలెక్టర్, ఎస్పీ అర్ధరాత్రి తనిఖీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లా సరిహద్దుల నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా రవాణా అవుతున్న నేపథ్యంలో అధికారులు దృష్టి సారించారు. సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా ఏర్పాటు చేశారు. యూరియా విక్రయాలపై కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి వీరిద్దరూ వారి వాహనాల్లో కాకుండా ప్రైవేటు వాహనాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాష్ట్ర సరిహద్దులోని పొందుగల చెక్‌పోస్టు వద్ద రాత్రి 10.30 నుంచి అర్ధరాత్రి దాటేవరకు వారు స్వయంగా అన్ని వాహనాల్లోనూ తనిఖీ చేశారు. ఆ తర్వాత దాచేపల్లిలో ఎరువులు నిల్వ చేసిన గోదాముల్లో కూడా సోదాలు చేశారు. శుక్రవారం తెల్లవారు జాము 2.30 గంటల వరకు ఈ తనిఖీలు సాగాయి.

ఆందోళన వద్దు : కలెక్టర్ అరుణ్‌బాబు

యూరియా అక్రమాలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు స్పష్టం చేశారు. అనవసర ఆందోళనలతో అవసరానికి మించి యూరియా కొనుగోళ్లకు రైతులు దూరంగా ఉండాలని సూచించారు.

ఎరువుల అక్రమాలపై పీడీ యాక్టు :ఎస్పీ శ్రీనివాసరావు

యూరియా అక్రమ నిల్వ చేసినా, అక్రమాలకు పాల్పడినా సంబంధితులపై ఏకా, పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. పొందుగల, తంగెడ, నాగార్జున సాగర్ చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.



రేపల్లె : నల్లూరుపాలెంలో ఎరువుల కోసం స్లిప్‌లు రాయించుకుంటున్న రైతులు

సూర్యలంక, రామాపురంలో బీచ్ ఫెస్టివల్

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26, 27, 28 తేదీల్లో సూర్యలంక, రామాపురంలో బీచ్ ఫెస్టివల్‌ను అట్టహాసంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులతో బీచ్‌ఫెస్టివల్ నిర్వహణపై శుక్రవారం జరిగిన సమీక్షలో కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ భారత స్థాయిలో బీచ్ క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. వాలీబాల్, ఖోఖో, బాక్సింగ్ వంటి క్రీడా పోటీలు భారీ స్థాయిలో నిర్వహించాలన్నారు. సినీ కళాకారులు, జబర్దస్త్ టీంల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించాలన్నారు. డ్యాన్సులు, మ్యూజికల్స్ నైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. బోట్ల ప్రదర్శన, స్పీడ్‌బోట్లు, స్పోర్ట్స్ రైడర్స్, గుర్రాలు, ఒంటెలు ప్రదర్శన ఉంచాలన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం 100 ఫుడ్ స్టాల్స్, 350 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, జిల్లా పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు వేగవంతం చేయండి

మంత్రి అచ్చెన్నాయుడ్ని కోరిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడ్ని కోరారు. శుక్రవారం మంత్రి కార్యాలయంలో అచ్చెన్నాయుడ్ని కలిసి రైతుల సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. పొగాకు కొనుగోలు, నిధుల జమ, యూరియా నిల్వలు తదితరాలపై మంత్రితో చర్చించారు. ప్రభుత్వం నల్లబర్లీ రైతులకు కొండంత అండగా నిలిచిందని ఏలూరి తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి వెలకట్టలేని దన్నారు. రైతుల వద్ద ఉన్న పంటను మొత్తాన్ని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన పొగాకును నిల్వ చేసేం దుకు గోదాములను వేగవంతంగా గుర్తించేలా చర్యలు తీసు కోవాలని మంత్రిని కోరారు. ఇప్పటి వరకు సుమారు రూ.220 కోట్ల విలువైన బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు గాను రూ.54 కోట్లు రైతుల ఖాతాలో నగదు జమైం దన్నారు. పర్చూరు నియోజకవర్గంలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను అందిస్తున్నట్లు ఏలూరి తెలిపారు. సొసైటీల ద్వారా యూరియాను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బర్లీసాగు నిషేధంపై రైతులకు వివరించి ప్రత్యామ్నాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

గురుదేవోభవ

33 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం ● ఘనంగా గురుపూజోత్సవం

ఉపాధ్యాయులకు రాధాకృష్ణన్ స్ఫూర్తి కావాలన్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చూపిన ప్రతిభా పాటవాలను కీర్తిస్తూ.. విద్యార్థులను తీర్చిదిద్దుతోన్న వైనాన్ని విశ్లేషిస్తూ.. హర్షధ్వానాల మధ్య సత్కరిస్తూ.. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కాపు కల్యాణ మండపంలో గురుపూజోత్సవం జరిగింది. 33 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయుల ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలన్నీ విద్యతోనే రూపుమాపగలమన్నారు. సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాధాకృష్ణన్ స్ఫూర్తితో ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయులే విద్యార్థుల జీవితాలను చక్కగా తీర్చిదిద్దగలరన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందన్నారు. ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షల చొప్పున ఎంపిక చేసిన పది పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులతోపాటు ప్రయోజకులను చేసే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. దేశభవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, చేనేత కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, సమగ్ర శిక్షాభియాన్ ఏపీసీ మర్రెడ్డి నాగిరెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, ఎంఈవోలు ఎస్.నిరంజన్, ప్రసాదరావు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు వై.సత్యవతిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ సునీత



పూలతో వీడ్కోలు

జైబోలో గణేష్ మహరాజ్‌కూ జై

తూర్పుబజారు గణనాథుడికి గ్రామోత్సవం

మార్టూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పుబజారు వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరాగా గ్రామోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. 39 ఏళ్ల నుంచి వినాయకుడి గుడి వద్ద చవితి పండుగను పురస్కరించుకుని విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడు 15 అడుగులు ఎత్తు కలిగిన విగ్రహాన్ని ఏర్పాటు చేసి పార్టీలకు, కులాలకు అతీతంగా ఘనంగా పూజాదికాలు నిర్వహించారు. శుక్రవారం బంతి పూలతో దారిని ఏర్పాటు చేసి మహిళలు స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ట్రాక్టరుపై ప్రత్యేకంగా అలంకరించిన విగ్రహానికి ద్వారపాలకుల్లాగా, రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలంకరణ మధ్య సాగిన గ్రామోత్సవంలో దారి పొడవునా మహిళలు స్వామికి పూజలు చేశారు. భక్తులు బాణాసంచా కాలుస్తుండగా, తప్పెట్లు, తాళాలతో యువకులు, మహిళలు వెంటరాగా గ్రామోత్సవం సందడిగా సాగింది. అనంతరం స్వామి వారి లడ్డును వేలంలో అమర్నేని కాశీవిశ్వనాథ్ రూ.63,400 దక్కించుకున్నారు. బొడ్డురాయిసెంటరు, పడమర బజారు, బలరాంకాలనీ, యూనియన్ బ్యాంక్, పెద్ద ఖానా, గన్నవరం రోడ్డు గుండా గణనాథుడు గ్రామోత్సవం జరిగింది. ఆ తర్వాత మార్టూరు వాగులో జై బోలో మహరాజ్‌కు అంటూ గణపతిని నిమజ్జనం చేశారు.



విద్యుత్ దీపాలంకరణతో గ్రామోత్సవం

అవీ..ఇవీ..

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


ప్రమాదానికి గురైన బస్సు

పంగులూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన 16వ నంబరు జాతీయరహదారిలో భగవాన్ రాజుపాలెం ఫ్లైఓవర్‌పై చోటుచేసుకొంది. శుక్రవారం తెల్లవారు జామున ప్రయాణికులతో బెంగుళూరు నుంచి వైజాగ్ వెళుతున్న బస్సు మండలం లోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైఓవర్‌పై ముందువెళుతున్న లారీని ఢీకొంది ఈ ఘటనలో బస్సుడ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రయాణికులు క్షేమంగా ఉన్నారు. గాయపడిన బస్సుడ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైవేఅంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోటేశ్వరరావు మృతిపై ఆందోళన

● హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ


పేర్లి కోటేశ్వరరావు(ఫైల్)

పేరాల(చీరాల), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేరాల హరీస్‌పేటకు చెందిన పేర్లి కోటేశ్వరరావుది సహజ మరణం కాదని, ఆయన్ను ఉద్దేశ్య పూర్వకంగానే హత్య చేశారంటూ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. భార్య ప్రియాంకతో చెరుకుపల్లిలో వస్త్రదుకాణం నిర్వహిస్తున్న కొద్దిరోజుల క్రితమే స్వగ్రామమైన పేరాలకు వచ్చాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ ఇంటి సమీపంలోని చిల్లచెట్లలో మృతి చెంది పడి ఉన్నాడు. దీనిపై అనుమానస్పద మృతిగా రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే దీనిపై కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మద్యంమత్తులో తమ బిడ్డ మరణించినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని అన్నారు. ఘటనపై పారదర్శకంగా విచారించి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులుగా ఎంపికైన మహిళలకు అభినందన


పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న విద్యార్థులు

పంగులూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా డిఎస్సీలో ప్రతిభచాటి ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురు మహిళా ఉపాధ్యాయులను రోటరీక్లబ్ ప్రతినిధులు అభినందించారు. పంగులూరుకు చెందిన పాటిబండ్ల పావని(ఎస్ఏ గణితం), దాసరి ప్రభావతి(ఎస్ఏ వృక్షశాస్త్రం), కొండమూరు గ్రామానికి చెందిన మోరబోయిన శిరీష(ఎస్జీటీ)గా ఎంపికయ్యారు. శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావు, హెచ్ఎం శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు తాటిసుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, వడ్డవల్లి వీరనారాయణ, పోతిన ప్రసాద్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ప్రారంభం

● మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు


మోటారును ప్రారంభిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఒకేసారి ఏర్పాటు చేసి శుక్రవారం అద్దంకి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు ప్రారంభించారు. ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కొమ్మినేని వారిపాలేనికి చెందిన రైతులు కలిసి తమకు వ్యవసాయ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయలని కోరారు. దీంతో మంత్రి ఆదేశాలతో గ్రామంలోని 44 మంది రైతులకు సంబంధించి 10 విద్యుత్ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే అధికారులు ఏర్పాటు చేయించారు. ఎంతో కాలం నుంచి ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి తమకు పంటల సాగు సమయంలో కనెక్షన్లు మంజూరు చేశారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఏడీ సూరేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, గ్రామ సొసైటీ అధ్యక్షులు కొమ్మాలపాటి రామారావు, టీడీపీ నేతలు ఏల్చూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ అలివేలుమంగమ్మ మృతి


అలివేలుమంగమ్మ (ఫైల్)

పంగులూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామ మాజీ సర్పంచ్ పెంట్యాల అలివేలుమంగమ్మ(87) మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అలివేలుమంగమ్మ శుక్రవారం కన్నుమూశారు. అలివేలుమంగమ్మ 2006 నుంచి 2011 వరకు చందలూరు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె అంత్యక్రియలు శనివారం ఉదయం చందలూరులో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని 35 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు నల్లఫ్యాంట్, నల్ల టీ షర్టు ధరించి ఉన్నట్లు చెప్పారు.

సింగయ్యకు సత్కారం

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటి ఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నేత వేల్పుల సింగయ్యను శుక్రవారం ఆపార్టీ నేతలు అభినందించారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లోని ఆయన నివాసం వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సింగయ్య, ఆయన సతీమణి అయిన మాజీ సర్పంచ్ కోటేశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కూనపరెడ్డి సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ హైమావతి, టీడీపీ నేతలు యస్థాని, కాక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు ఘన సత్కారం

● చీరాలలో ఉపాధ్యాయ దినోత్సవం ● కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న వీరాంజనేయులు


గురువులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో గురువులను మించిన దైవం లేదని, వారి సూచనలు తప్పక పాటించి ఉన్నత గమ్యాలు చేరుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య దశ నుంచి ఆచరించ వలసిన అంశాలను వివరించారు. పుల్లెల సుబ్రహ్మణ్యం, ముట్టే వెంకటేశ్వర్లు(ఎంఈ), వెంకట రమణారావు, నాగమల్లేశ్వరరావు, మన్నెం వెంకటశ్వరరావులను ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు.

బత్తుల సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో

బత్తుల సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిఎస్పీ ఎండీ మొయిన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు హాజరయి సమాజంలో ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని చాటారు. 10 మందికి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని నలుగురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు అందుకున్నారు. శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి అవార్డులు దక్కాయి. వీరిలో వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయినీగా పనిచేస్తున్న జరుబుల శ్రావణి, బూసం లలితాంబ, వడ్డె సంఘం ఎంపీపీ పాఠశాలకు చెందిన పోపూరి రంగారావు, నాయనిపల్లి(ఈస్ట్) ఎంపీపీ పాఠశాలకు చెందిన తెలగతోటి ఇందిర ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈక్రమంలో మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులు వీరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

వీరాంజనేయులుకు పురస్కారం

బల్లికురవ : మండలంలోని కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గాలం వీరాంజనేయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటమురళి, డీఈవో పురుషోత్తం చేతుల మీదుగా అందుకున్నారు. గత 17 ఏళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పలువురు విద్యార్థులను తీర్చి దిద్దడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను జిల్లా అధికారులు గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గాలం వీరాంజనేయులుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన వీరాంజనేయులను యూటీఎఫ్ నేతలు, వినయ్, అడుగుల శ్రీనివాసరావు, దూళిపాళ్ల శేషగిరి, సంపతి శ్రీనివాసరావు, కోటి నాగులు, చంటి శ్రీనివాసరెడ్డి, బొప్పుడి శ్రీనివాసరావు, చెన్నారెడ్డి, మోషే మరియు పలువురు ఉపాధ్యాయులు, హెచ్ఎంలు అభినందనలు తెలిపారు.




మాట్లాడుతున్న డీఎస్పీ మోయిన్, అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు, ప్రశంసాపత్రం అందుకుంటున్న వీరాంజనేయులు

ఏడుగురు వైసీపీ నేతలపై కేసు

ముక్కుపచ్చలారని చిన్నారుల చేత రప్పా రప్పా ప్లకార్డుల ప్రదర్శనపై పోలీసుల చర్యలు

పొన్నలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డి గారి ప్రభుత్వం వస్తే ఒక్కొక్కడికి రప్పా రప్పా.. నేడు మీది, రేపు మాది.. అంటూ రెచ్చగొట్టేలా వైసీపీ నేతలు వ్యవహరించిన తీరుపై పోలీసులు కన్నెర్ర చేశారు. ఆ పార్టీకి చెందిన ఏడుగురు నేతలపై కేసు నమోదు చేశారు. వైయస్ వర్ధంతి సందర్భంగా మండలంలోని వైరెడ్డి పాలెంలో వైసీపీ నేతలు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ సహ పార్టీ నేతలు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం గణేష్ విగ్రహం దగ్గరకు ఊరేగింపుగా బయలుదేరిన నేతలు.. అధికార పార్టీని రెచ్చగొట్టేలా ప్లకార్డులు ప్రదర్శించారు. రెడ్డి గారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్కొక్కడికి రప్పా రప్పా.. నేడు మీది రేపు మాది అంటూ నినాదాలు కూడా చేశారు. చిన్నారుల చేత కూడా ప్లకార్డులు చేతబట్టించి రెచ్చగొట్టేలా నినాదాలు చేయించిన వైసీపీ నేతల తీరును గ్రామస్థులు తప్పుబడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో దారుణమైన పరిపాలన గుర్తుకు తెచ్చుకుని, రాష్ట్ర ప్రజలు 11 సీట్లు పరిమితం చేసినా వీరి వైఖరిలో ఏ మాత్రం మార్పు రాలేదని చర్చించుకున్నారు. వైసీపీ నేతల వ్యవహార శైలిపై స్థానికటీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ చేపట్టిన పోలీసులు ఏడుగురు నేతలపై కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, కర్ణ మస్తాన్ రెడ్డి, కదిరి సుధాకర్ రెడ్డి, కదిరి రవిరెడ్డి, కదిరి కృష్ణారెడ్డి, సిరిగిరి రామకృష్ణారెడ్డి, దారా చినరామయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనుక్ తెలిపారు.


ప్లకార్డులతో చిన్నారులు, మాజీ మంత్రి సురేష్, వైసీపీ నాయకులు

పడిపోయిన పరపతి

(5వ పేజీ తరువాయి)

వర్సిటీని ప్రక్షాళన చేయా ల్సింది పోయి ఓ ఉన్నతాధికారి అన్ని అంశాలకు అడ్డుగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం లోని అన్ని యూనివర్సిటీ లకు పూర్తి స్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ లు వచ్చాయి. ఒక్క ఎన్ జీ రంగా యూనివర్సిటీ మాత్రం నోటిఫికేషన్ నుంచి తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పీఎం, సీఎం ఆలోచనలకు బ్రేకులు..

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్ద పీట వేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. అందులో భాగంగానే నమో దీదీ పథకం ద్వారా డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా గ్రామాల్లోని రైతులను యూనివర్సిటీకి పిలిపించి డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని కొంతకాలం నిర్వహించారు. ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి శిక్షణను అర్థాంతరంగా నిలిపివేశారు. ఇన్‌చార్జి వీసీ ఆదేశాలతోనే డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు తెలుస్తుంది. ఒకపక్క రైతులకు డ్రోన్లు పంపిణీ చేసి వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తూ ఉంటే మరో పక్క అందుకు భిన్నంగా వీసీ ఆదేశాల ఇవ్వడం చర్చనీయాంశంగా మారుతుంది.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమాదేవి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఒంగోలు నియోజకవర్గం బీసీ సామాజిక వర్గానికి చెందిన తమ్మిశెట్టి రమాదేవిని నియమిస్తూ టీడీపీ అధిష్టానం ప్రకటించింది. గతంలో ఒంగోలు నగర మహిళ అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమె గతంలో తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో రమాదేవికి రాష్ట్ర వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి లభించింది.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రకాశం జిల్లా నుంచి నలుగురు టీచర్లకు అవార్డులు అందజేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్


సీఎం బాబు, మంత్రి లోకేష్ చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న సరోజనీదేవి, ఈశ్వరమ్మ, భాస్కరరావు, సుధాకర్

విజయవాడ సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ప్రకాశం జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో మొగళ్లూరు జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న సరోజనీదేవి, పీసీపల్లి జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న ఈశ్వరమ్మ, తంగెళ్ల జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న బాస్కరరావు, తర్లుపాడు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుధాకర్‌లు ఉన్నారు.

బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటా!

రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకల్యాణ చక్రవర్తి


సూర్యకల్యాణ్‌చక్రవర్తిని సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా పార్టీ పదవి చేపట్టిన సూర్యకళ్యాణ్ చక్రవర్తిని జిల్లా బీజేపీ నేతలు భారీ గజమాల, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవన్, సంఘటన్ మంత్రి మధుకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు వచ్చిన పదవి పెద్ద బాధ్యతని, దానిని సక్రమంగా నిర్వర్తించేందుకు అందరిని కలుపుకుని పోతానని చెప్పారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా దానిని తీర్చేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పార్టీ అధిష్టానంతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, ముఖ్యనాయకులు సూర్యకళ్యాణ్‌చక్రవర్తిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.నర్సింగరావు, బొద్దులూరి ఆంజనేయులు, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ కరస్పాండెంట్ సీవీ.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, డాక్టర్ జేవీ.నారాయణ, అశోక్‌రెడ్డి, అమరసింహం, తోగంటి శ్రీనివాసులు, యోగయ్యయాదవ్, బోడపాటి బ్రహ్మయ్య, ఎం.శ్రీనివాసరావు, కావూరి వాసు, నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

20మందికి కుక్కకాటు

కొమరోలు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరోలు, తాతారెడ్డిపల్లి, పురుషోత్తంపల్లి, గోపానిపల్లి గ్రామాల్లో పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తూ 20మందిని కరచింది. ఆయా గ్రామాల్లోని రోడ్లపై వెళ్తున్న పిచ్చికుక్క కనపడిన వారిని ఇష్టంవచ్చినట్లు కరుస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి పిచ్చికుక్క కాటుకు గురైన బాధితులు కొమరోలు ప్రభుత్వవైద్యశాలకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకున్నారని, 20మందికి టీకాలు వేశామని వైద్యసిబ్బంది తెలిపారు. తీవ్రంగా గాయాలకు గురైన నలుగురిని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు పంపి హిమోగ్లోబిన్ వ్యాక్సిన్ వేయించారని తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జనసేన కార్పొరేటర్ల గుజరాత్ టూర్..!

● 10న బాలినేని ఆధ్వర్యంలో విహారయాత్ర

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థలోని జనసేన కార్పరేటర్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో విహారయాత్రకు సిద్ధమయ్యారు. ఈనెల 10 నుంచి 16వతేదీ వరకు గుజరాత్‌లోని ప్రముఖ ఆలయాలను సందర్శించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రయాణ ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఒంగోలు నుంచి ట్రైన్‌లో చెన్నై చేరుకుని, అక్కడ నుంచి విమానంలో అహ్మదాబాద్ చేరుకుంటారు. అక్కడే ఏడు పగళ్లు, ఆరు రాత్రులు ఉండేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఎరువులు ఏమవుతున్నాయ్..

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెప్పారు. అయితే ఇప్పటికీ యూరియా వెతలు వెంటాడుతూనే ఉన్నాయి. సీజన్ మొత్తానికి కావాల్సిన ఎరువుల్లో ఇప్పటికే 60 శాతం పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. మొత్తం విస్తీర్ణంలో 70 శాతం సాగు కూడా ఇంకా పట్టాలెక్కలేదని ఈ-క్రాప్ లెక్కలే చెబుతున్నాయి. గుంటూరు జిల్లాలో 5125, పల్నాడులో 9132, బాపట్లలో 6789 టన్నుల యూరియా నిల్వలు అందుబాట్లో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అయితే యూరియా కోసం ఇక్కట్లు ఎందుకు వచ్చాయనే దానికి అధికారుల నుంచి సమాధానం లేదు. ఇప్పుడు తెచ్చుకోకపోతే యూరియా ఇక బయట దొరకదు అనే విధంగా తప్పుడు ప్రచారం జరగడం, దానిని నమ్మడం కూడా ప్రస్తుత పరిస్థితికి ఓ కారణంగా ఉంది. యూరియా పంపిణీలో రాజకీయ జోక్యం కూడా రైతుల ఇక్కట్లుకు ఒక కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు డీలర్లతో కొంతమంది ఉద్యోగులు కుమ్మక్కు కావడంతో బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం పంపిణీపై అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా సమస్య తీవ్రతరం కావడానికి కారణంగా కనబడుతోంది.

పంపిణీపై లెక్కలేవీ..

ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి. ఇక్కడే చాలావరకు పక్కదారి పట్టాయని రైతులు ఆరోపిస్తున్నారు. నేతలు చెప్పినవారికే భారీ యూరియా నిల్వలు తరలించారని, దీంతో చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ప్రారంభంలో యూరియా పంపిణీ విషయంలో లెక్కాపత్రాలేవీ లేకుండానే ఒక్కొక్కరికి 30 నుంచి 50 బస్తాల వరకు ఇవ్వడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణంగా కనిపిస్తుంది. ప్రభుత్వం భారీ స్థాయిలో యూరియా కేటాయించినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తుండగా, కొద్దిమంది వద్దకే ఆ నిల్వలు చేరడమే ఈ కటకటకు కారణంగా ఉంది. యూరియా విషయంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని అంచనా వేయలేకపోయిన అధికారులు ప్రారంభంలో పంపిణీని పట్టించుకోలేదు. స్థానికంగా ఉండే నేతల మీదనే వదిలేశారు. దీంతో వారు దీనిని అవకాశంగా చేసుకుని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. శాస్త్రీయంగా చూస్తే ఎకరానికి ఇప్పటి వరకు రెండు యూరియా బస్తాలను రెండు దఫాలుగా రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరుకు ఇంకోసారి నిబంధనల ప్రకారం అందించాలి. అది కూడా సదరు రైతు తంబ్ వేయించుకున్నాకే. కానీ వీటిని వదిలేసి ఒక్కొక్కరికి రెండు టన్నులు కూడా ఇచ్చారని, ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌కు కొంత తరలించడంతో అందరి ప్రయోజనం కాస్తా కొద్ది మందికే పరిమితమైనట్లు తెలుస్తోంది.

సమన్వయ లోపం కూడా కారణమే...

యూరియా ఇక్కట్లకు సంబంధించిన సంకేతాలు దాదాపు మూడు వారాల క్రితమే కనిపించాయి. అప్పుడే అప్రమత్తమవ్వాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. అందువల్లే ఇప్పుడు పరిస్థితి తీవ్రతరమైందని తెలుస్తోంది. వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, విజిలెన్స్‌తో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాలు కూడా సమన్వయంతో అడుగులు వేసి ఉంటే యూరియా పక్కదారి పట్టకుండా చాలా వరకు నియంత్రించగలిగే వారు. కానీ ఆయా విభాగాల మధ్య సమాచార లోపంతో పాటు బాధ్యతల విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరించడం కూడా పరిస్థితి అదుపు తప్పడానికి కారణమైందన్న విమర్శలు వస్తున్నాయి.

రైతుల మధ్య ఘర్షణలు..

యూరియా నిల్వలు వచ్చాయని తెలిస్తే ఆర్ఎస్కేలు, సొసైటీల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో రైతుల మధ్య ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రేపల్లె మండలం నల్లూరుపాలెంలో ఎరువుల కోసం శుక్రవారం రైతులు ఎగబడటంతో చిన్నపాటి గొడవలు జరిగాయి. పోలీసులు దగ్గరుండి క్రమపద్ధతిలో రైతులకు యూరియాను అందించాల్సి వచ్చింది. పలుకుబడి ఉన్నవారు ఐదు, పదికట్టలు క్యూలో నుంచోకుండా తీసుకువెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది దళారులు, పీఏసీఎస్ అధ్యక్షులు అధిక ధరలకు యూరియాను అమ్ముకుంటున్నారంటున్నారు.

అవీ..ఇవీ..

నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి

- వీరరాఘవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధుల మంజూరు
- పాలక మండలి కమిటీ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న దేవాలయ కమిటీ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేసి భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీవీరరాఘవస్వామి వారి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.48 లక్షలు మంజూరు కాగా, దేవస్థానం ప్రతినిధుల నుంచి రూ.24 లక్షల నిధులతో పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. అలాగే నూతన ధర్మకర్తలి మండలి చైర్మన్‌గా మామిడాల రాములు, డైరక్టర్లతో ప్రమాణీ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూల్ ఉల్లి రైతులకు అండగా ఉండాలి

కర్నూల్ ఉల్లి రైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. అక్కడి ప్రతికూల పరిస్థితులు కారణంగా రైతులు సంక్షోభంలో ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలోనే అండగా ఉండేందుకు మార్కెట్ ధరం కంటే తక్కువగా కిలో రూ.17లకే ఉల్లి అందిస్తున్నట్లు వివరించారు. శుక్రవారం పట్టణంలో ఉల్లి విక్రయాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నేతలు

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలో వేంచేసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా దగ్గుబాటి చౌదరితోపాటు, పాలక మండలి సభ్యులు ప్రయాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ చౌదరి తెలిపారు. పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు హాజరై నూతన పాలక మండలిని అభినందించారు. కార్యక్రమంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, కుంకలమర్రు సొసైటీ అధ్యక్షులు బంగారుబాబు, మండలపార్టీ అధ్యక్షులు తిరుముల శెట్టి శ్రీహరి, ఇంకొల్లు టీడీపీ సీనియర్ నేత శ్రీను, స్థానిక టీడీపీ నేతలు జాగర్లమూడి ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

తోటవారిసత్రంలో గది నిర్మాణానికి శంకుస్థాపన



గది నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

చినగంజాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని తోటవారిసత్రం ఆవరణలో నూతన గది నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. పురుషోత్తమ పట్టణానికి చెందిన తోట వంశీకులు గ్రామంలో 1953 సంవత్సరంలో తోటవారి సత్రాన్ని నిర్మించారు. శిథిలావస్థకు చేరిన సత్రాన్ని ఇటీవల కాలంలో తొలగించారు. దీంతో ఏలూరి సాంబశివరావు సత్రం పునర్మానానికి దేవదాయశాఖ ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో నిర్మించే ఒక గది నిర్మాణానికి కూటమి నాయ కులు, తోట వంశీకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈ.వో ఎం.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, కూటమి నాయకులు, తోటవారిసత్రం వంశీకులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన సందడి

- ఒక్కొక్కటిగా తరలుతున్న గణనాథుని విగ్రహాలు
- లడ్డూ కోసం భక్తుల పోటీ
- బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



నిమజ్జనానికి తరలివెళుతున్న పాత ఆంధ్రబ్యాంకు సమీపంలోని వినాయకుడు

అద్దంకి సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జన ఉత్సవాలు శుక్రవారం ఉత్సహంగా సాగాయి. అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శు క్రవారం రాత్రి గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు. డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యాల నడుమ నిమజ్జనోత్సవాలు సాగాయి. పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డును లాటరీ ద్వారా ఆర్యవైశ్య నాయకుడు గోపు శ్రీనివాసరావు దక్కించుకున్నారు. అనంతరం 12 వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. అద్దంకి పట్టణంలోని బలిజపాలెం, కాకానిపాలెం, యాదవుల బజారు, వైఎస్ఆర్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలతో పాటు మండలంలోని తిమ్మాయపాలెం, శంకవరప్పాడు తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాల నిమజ్జనాలు శుక్రవారం నిర్వహించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోటాపోటీగా వినాయకుల ఏర్పాటు

అద్దంకి : మండలంలోని నాగులపాడులో పోటాపోటీగా ఏర్పాటు చేసే రెండు వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తుంటారు. ఈ నిమజ్జనోత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2004లో ప్రారంభమైన వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనో త్సవాల నిర్వహణ ఏటికేడు ప్రత్యేకత సంతరించు కుంటోంది. గ్రామంలోని రెండు వర్గాలు రెండు దశాబ్దాలుగా పోటాపోటీగా భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పాటు, నిమజ్జనోత్సవాలను లక్షల రూపాయలు వెచ్చించి ఘనంగా నిర్వహిస్తుంటారు. గత ఆరేడు సంవత్సరాలు గా గ్రామంలోని రెండు ప్రధాన వర్గాలు టీడీపీలోనే ఉన్నప్పటికీ, వినాయక విగ్రహాలను మాత్రం వేర్వేరు గానే ఏర్పాటు చేసి, ఎవరికి వారే ఘనంగా నిమజ్జన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కరి పరమేష్ వర్గం గొట్టిపాటి యూత్ పేరుతో నిమజ్జనోత్సవాలు నిర్వహిస్తుండగా, తెలుగు యువత నాయకులు పెంట్యాల రామాంజనేయులు ఆధ్వర్యంలో నాగులపాడు తెలుగుయువత పేరుతో వినాయక విగ్రహం ఏర్పాటు, నిమజ్జనోత్సవం నిర్వహిస్తుంటారు. రెండు వి గ్రహాలు తెలుగుదేశం నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తుండడంతో ఇరువర్గాలు ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల వద్దకు మంత్రి రవికుమార్ హజరై పూజలు నిర్వహిస్తుంటారు. కొవిడ్ సమయంలో మినహా మిగిలిన అన్ని సంవత్సరాలలో రెండు వర్గాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు ఉదయం నాగులపాడు గ్రామంలోని అన్ని ప్రధాన వీధులలో నిర్వహిస్తారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల సమయానికి అద్దంకి పట్టణంలోకి చేరుతుంది. భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ వెలుగులు, వివిధ రకాల వాయిద్యాలు, కళాకారుల నృత్యాల మధ్య అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ నుండి భవానిసెంటర్ వరకు అర్ధరాత్రి వరకు ఊరేగింపులు నిర్వహిస్తారు. అద్దంకి పట్టణంతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాల లోని పలు ప్రాంతాల నుండి భక్తులు వినాయక నిమజ్జనోత్స వాలను తిలకించేందుకు భారీగా తరలివస్తారు.

నేడు వినాయక నిమజ్జనం

గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనోత్సవం శనివారం నిర్వహిస్తుండగా, నాగులపాడు తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం నిమజ్జనోత్సవము ఈ నెల 13న నిర్వహించనున్నారు.

బల్లికురవ : వినాయకచవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులకు నవరాత్రుల పూజల అనంతరం శుక్రవారం ఘనంగా నిమజ్జన వేడుకలు నిర్వహించి వీడ్కోలు పలికారు. మండలంలోని గుంటుపల్లి శివాలయంలో, చినఅంబడిపూడి బొడ్డురాయి కూడలిలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాలలో గణనాథుల వద్ద ఏర్పాటు చేసిన లడ్డులను గ్రామ టీడీపీ నేతలు దద్దాల అంజయ్య, మలినేని గోవిందరావులు దక్కించుకొని పెద్ద ఎత్తున ఊరేగింపు మధ్య నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. గుంటుపల్లి గ్రామంలో దక్షిణం బజారులో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద శుక్రవారం రాత్రి ప్రముఖ భజన కళాకారుడు డప్పు శ్రీను బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు.







గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలోని వినాయకుడు, అద్దంకిలో లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసరావు, అంబడిపూడిలో లడ్డూతో అంజయ్య,

నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఉచితంగా పంపిణీ

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్‌బాబు

మార్టూరు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లికొండపై ఫారెస్ట్ అటవీ భూములలో పెంచుతున్న నర్సరీ నుంచి అవసరమైన వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోని బొబ్బేపల్లి కొండపై 350 ఎకరాల వరకు అటవీ భూములు ఉన్నాయి. ఈ భూములలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటుచేసి, 40 వేల మొక్కలను పెంచుతున్నామన్నారు. ఈ నర్సరీలో చింత, నేరేడు, ఉసిరి, జామ, దానిమ్మ, నిమ్మ, రావి తదితర మొక్కలను పెంచుతున్నారు. అయితే చుట్టుప్రక్కల గ్రామాలలోని ప్రభుత్వ స్కూళ్లు, లేదా ప్రవేటు విద్యాలయాలు, ఇంకాఏమైనా సంస్థలు వారు, మొక్కలు కావలసిన వారు సంబంధిత అధికారుల ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. అంతేగాకుండా ఎవరైనా గ్రామస్థులు ఆధార్ కార్డుతో వస్తే నాలుగు లేదా 5 మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఇంకా భారీగా మొక్కలు కావలసిన వారు ఎంపీడీవో ధ్రువీకరణ పత్రంతో వస్తే మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా ఫారెస్ట్ కొండపై కొంతమంది వన్యప్రాణులను వేటాడుతున్నారని, జంతువులను పట్టుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో శుక్రవారం ఆయన కొండ సమీపంలో, టీడీపీ నాయకులు చింతలపూడి శ్రీనివాసరావు సమక్షంలో రాజు గారిపాలెం వాసులతో మాట్లాడారు. అటవీ భూములలో వేట నిషిద్ధమన్నారు.కొండపై జంతువులను వేటాడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలు



రాజుపాలెం వాసులతో మాట్లాడుతున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో మీలాద్ ఉన్ నబి పర్వదినం

పర్చూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకొనే మీలాద్ ఉన్ నబి పర్వదినాన్ని ముస్లిం లు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన పర్చూరులోని పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ ఇస్లామిక్ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం మూడో నెల అయిన రవిపుల్ అవ్వల్లో ఈ పండుగ వస్తుందన్నారు. నీలాదూర్ నబి అంటే ప్రవక్త యొక్క జననమని అర్థమన్నారు. అనంతరం ముస్లింలు జెండాలతో మసీదు నుంచి చీరాలరోడ్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు అహ్మద్ బాషా, నబీసా, షేక్.బాషా(కొబ్బరిబోండా), కాలేషా, మస్తాన్, బుల్లా మేస్త్రీ, షేక్‌గౌస్, బాజీ, పఠాన్ బాజీ, ఖాజావలి పాల్గొన్నారు.



పర్చూరులో జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వేటపాలెం(చీరాల) : వేటపాలెంలో శుక్రవారం ఘనంగా మిలాద్ - ఉన్ - నబీ వేడుకలు ముస్లిం మతపెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రవక్త మహ్మద్ సలల్లాహు అలైహీ వసలం జనానాన్ని పురస్కరించుకుని నిర్వహించే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు వివరించారు. గురువు, మహా ప్రవక్త వేడుకలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుభానీ, షఫీవుల్లా, అన్వర్‌బేగ్, రఫీ, జునైద్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో అర్జీల స్వీకరణ

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో కూటమి నాయకులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు గంజి పురుషోత్తం మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో పింఛన్ 15, నివేశన స్థలాలు 60, ఇతర సమస్యలకు సంబంధించి 5 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పద్మిని, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోటీపరీక్షలతో విద్యార్థుల సామర్థ్యాల గుర్తింపు



విజేతకు బహుమతి అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

పంగులూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించ వచ్చని, రోటరీక్లబ్ అధ్యక్షుడు, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బత్తులవీరనారాయణ అన్నారు. గత నెల 19న రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంయుక్తంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షల విజేతలకు గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల పది, తొమ్మిది, ఆరవతరగతి విద్యార్థులు కట్టా వంశీకృష్ణ, కేజాకబ్, శ్రీవిద్య, బూదవాడ ఉన్నత పాఠశాల 8వతరగతి విద్యార్థిని జి.హరిణి, కోటపాడు 7వ తరగతి విద్యార్థిని పి.నిఖితలు ప్రథమ స్థానంలో నిలిచారు. రిషితమారుతి, అర్పిత, పవన్‌గోపి, మమతారెడ్డి, హర్షిత ద్వితీయస్థానం దక్కించుకున్నారు. హెచ్‌ఎం సోమేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రాయిణి రామారావు, అజిత్‌ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ క్లబ్ ప్రతినిధులు తాటిసుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, పోతిన ప్రసాద్, పూర్వవిద్యార్థి సంఘం అధ్యక్షుడు తలపనేని రామాంజనేయులు, హెచ్‌ఎంలు శ్రీహరి, వేణుబాబు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చెరుకూరు (పర్చూరు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ, అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామివార్ల కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లకు హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహణ కార్యదర్శి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చీరాల్లో మరోసారి గంజాయి పట్టివేత

- కదిలే రైలులో జిల్లా ఈగల్ టీం తనిఖీలు

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో మరోసారి గంజాయి కలకలం రేపింది. జిల్లా ఈగల్ టీం శుక్రవారం రాత్రి కదిలే రైలు బోకోరాలో తనిఖీలు నిర్వహిస్తుండగా 4 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో గంజాయి పెద్ద మొత్తంలో పట్టుబడుతుండటంతో ప్రజలు భీతిల్లుతున్నారు.

రంగస్థల కళాకారుడు కాశీరాజు కన్నుమూత



కాశిరాజు (ఫైల్)

సంతమాగులూరు సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : ప్రకాశం బాపట్ల పల్నాడు గుంటూరు జిల్లాల కళాభిమానులకు సుపరిచితుడైన యాదాల కాశీరాజు (79) శుక్రవారం కన్ను మూశారు. కాశిరాజుకు భార్య కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. మోకాళ్ల శస్త్ర చికిత్స నిమిత్తం ఒంటరిగా హైదరాబాదు వెళ్లిన కాశయ్య ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంటికి వచ్చి కన్నుమూశారు. సత్య హరిచంద్ర శ్రీరామాంజనేయయుద్ధం వీరబ్రహ్మంగారి నాటకం, బభ్రువాహన, యాదులరాజు, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ చరిత్ర తదితర నాటకాలలో ప్రముఖ పాత్రలను పోషించి ఆయన ప్రజల మెప్పును పొందారు. సత్య హరిచంద్రలో కాట శీను హరిశ్చంద్రుడిగా యాదాల కాశయ్య ప్రసిద్ధి. ప్రముఖ రంగస్థలం కళాకారులు ఏవీ సుబ్బారావు డీవీ సుబ్బారావు, మిద్దె ఆంజనే యులు, చీమకుర్తి నాగేశ్వరరావుకు కాశయ్య సమకాలీకులు.

లస్కర్‌గానూ సేవలు : ఎస్ఎస్‌పీ కాలువలపై లస్కర్‌గానూ విధులు నిర్వహించిన ఆయన 30 సంవత్సరాలపాటు రైతులకు సేవలందించారు. 2006లో ఉద్యోగ విరమణ చేశారు. కాశయ్య పెద్ద కుమారుడు యాదాల శ్రీనివాసరావు ప్రస్తుతం పల్నాడు జిల్లా ల్యాండ్ రికార్డ్ సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. రెండవ కుమారుడు ఆంజనేయులు మతిస్థిమితం కోల్పోయిన వారికి ప్రకృతి వైద్యం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కాశయ్య అల్లుడు గోపాలకృష్ణ కూడా లస్కర్ గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

సంతరావూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటి బాధ్యతల స్వీకరణ

చినగంజాం, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని సంతరావూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన త్రీమన్ కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించారు. సంతరావూరు పీఏసీఎస్ ఆవరణలో పర్సన్ ఇన్‌చార్జ్‌గా యార్లగడ్డ లక్ష్మీ, సభ్యులుగా బండారు ఆంజనేయులు, మైలా ప్రసాద్‌లతో పీఏసీఎస్ సీఈవో కే.కృష్ణచైతన్య ప్రమాణస్వీకారం చేయించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఏవో ఆర్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ లక్ష్మీ మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించి, వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కర్షకమిత్ర పథకం ద్వారా మంజూరైన రూ.50 లక్షల విలువైన చెక్కులను నలుగురు రైతులకు అందజేశారు. సంతరావూరు రైతు సేవాకేంద్రం ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం సంఘం ఆవరణలో ఆమె, అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు పర్చూరు శాఖ సూపర్‌వైజర్ కే.శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు దేవతోటి సుందరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆతిన సురేష్, కనకనాగ వరపమ్మ అమ్మ వారి దేవస్థాన చైర్మన్ వలేటి ఆంజనే యులు, టీడీపీ నాయకులు కేశనపల్లి శ్యాంబాబు, గోవిందు సుబ్బారావు, ఉప్పుటూరి సునీల్, ఆర్ఎస్‌కే సిబ్బంది బి.కిషోర్, కృపాసిని, పీఏసీస్ సిబ్బంది పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న పర్సన్ ఇన్‌చార్జి యార్లగడ్డ లక్ష్మి

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరులో వెండి నందిపై మూలస్థానేశ్వరుడి వైభోగం

శైవక్షేత్రాలలో భక్తుల రద్దీ • 7న ఆలయాల మూత

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్

నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

8 లో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శనివారం 6 సెప్టెంబరు 2025



విద్యాభివృద్ధికి బాధ్యతతో పని చేయాలి

- పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యనందించండి
- సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు
- గురుపూజోత్సవంలో కలెక్టర్ ఆనంద్
- 38 మంది టీచర్లకు అవార్డులు, సత్కారం

8 లో..



తిరుమంజనం అనంతరం ఉత్సవర్లకు పూజలు చేస్తున్న అర్చకులు

కోనలో వైభవంగా పవిత్రోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివార్లకు ఉదయం వేద, దివ్యప్రబంధ పారాయణం అనంతరం ద్వారతోరణం, ధ్వజకుభ ఆరాదన, మహాకుభారాదన, చక్రజ్ఞ మండల, అగ్నిప్రతిష్ఠ, విశేష మోమాదులు, స్నపన తిరుమంజనం, ప్రాయశ్చిత్త హోమం వంటి పూజలు జరిగాయి. సాయంత్రం చతుస్థానార్చన నివేదన, దివ్య ప్రబంధ పారాయణం, విశేష హోమం, తిరుచ్చి ఉత్సవం, నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అడుగంటుతున్న

‘రాళ్లపాడు’

- 7.2 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- వర్షాలు కురవకపోతే తాగునీటికి ఇక్కట్లే

లింగసముద్రం, ,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 7.2 అడుగులకు పడిపోయింది. ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో నీటి నిల్వలో ఆక్సిజన్ తగ్గి నీరు పచ్చగా వస్తోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సోమశిల జలాశయం, మన్నేరు ఎగువ భాగం నుంచి డ్యాంలోకి నీరు రావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే డ్యాం పరిసర గ్రామాల్లో నీటిఎద్దడి తప్పేలాలేదు. దీంతో ప్రజలు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సోమశిల ఉత్తర కాలువ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయ్యేందుకు మరో నెల రోజులు పడుతుందని, ఆ తర్వాతనే సోమశిల నుంచి నీరు వస్తుందని అధికారులు తెలిపారు. ఈ లోపు వర్షాలు కురవకపోతే మంచినీటి ఇబ్బందులు తప్పవేమోనన్న ఆందోళన ఇటు గ్రామస్థులు.. అటు రైతుల్లోనూ నెలకొంది.

• ‘సోమశిల’కు 25,288 క్యూసెక్కుల వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 25,288 క్యూసెక్కుల ప్రవాశం కొనసాగింది. డ్యాంలో 66.240 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,300, డెల్టాకు 1,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో 7.2 అడుగులకు పడిపోయిన నీటిమట్టం

రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖలో బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లకు ఈ నెల 7న ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో పరీక్షల నిర్వహణపై అధికారులతో డీఆర్వో సమీక్షించారు. నెల్లూరులో 8, కావలిలో 7 కేంద్రాలలో జరిగే పరీక్షలకు 6600 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు అన్నీ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



నెల్లూరు : కొళ్లపూడిలోని జగనన్న కాలనీలో పునాదుల దశలోనే ఉన్న ఇళ్లు

అవినీతికి అదే బేస్!

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాలో భారీగా ఇళ్లు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో లేఅవుట్లు వేసి ఆ స్థలాల్లో ఇళ్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఒక్కో ఇంటి నిర్మాణానికి ఇస్తుండగా ఆ మొత్తాన్నే లబ్ధిదారుకు అందించాలని నాటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే చాలా చోట్ల లేఅవుట్లు ఊరికి దూరంగానూ, ముంపు ప్రాంతాల్లోనూ, స్మశానాలకు సమీపాన వేయడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. ఈ సమయంలో నాటి ప్రభుత్వం మెహర్బానీ కోసం ఆప్షన్-3 పేరుతో కాంట్రాక్టర్ల చేత ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావించింది. లబ్ధిదారుడి అనుమతి లేకుండానే హౌసింగ్ అధికారులు ఇష్టానుసారం ఇళ్లను వందల మంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. కనీసం ఒక అగ్రిమెంట్ అనేది కూడా లేకపోవడం గమనార్హం. తొలుత బేస్ లెవల్ (బీఎల్) స్థాయి నిర్మాణం జరిగితే రూ.50 వేలు ఇచ్చే విధానం ఉండగా, దానిని రూ.70 వేలకు పెంచారు. ఆ తర్వాత వేల ఇళ్లను బీఎల్ స్థాయి వరకూ నిర్మించి రూ.70 వేల లెక్కన బిల్లులు తీసేసుకొని కాంట్రాక్టర్లు మాయమయ్యారు. జిల్లాలో 82,422 ఇళ్లను మంజూరు చేయగా అందులో 36 వేలకుపైగా ఇళ్లు నాట్ స్టార్టెట్ నుంచి బేస్ లెవల్ స్థాయిలోనే ఉన్నాయి. ఇందులో 15 వేలకు పైగా ఇళ్లకు రూ.60 వేల నుంచి 70 వేల చొప్పున చెల్లించగా, మరో ఆరు వేల ఇళ్లకు రూ.30 వేల వరకూ పేమెంట్ చేసినట్లు హౌసింగ్ అధికారుల ద్వారా తెలుస్తోంది.

> గృహ నిర్మాణ శాఖలో పునాదుల మాయాజాలం
>
> బేస్‌మెంట్ కట్టడం.. రూ.70 వేలు తీసుకోవడం
>
> ఒక్కో ఇంటికి రూ.40 వేలు లాభం
>
> జిల్లాలో 15 వేల ఇళ్లు బీఎల్ స్థాయిలోనే!
>
> ఆపై నిర్మించకుండా దాగుడుమూతలు
>
> దోచుకుతిన్న కాంట్రాక్టర్లు, అధికారులు

• దోచుకున్న సొమ్ముతో వ్యాపారాలు

మొత్తంగా చూసుకుంటే బీఎల్ కన్నా తక్కువ స్థాయిలో పేమెంట్ జరిగిన సుమారు 21 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం అధోగతిగా మారింది. ఒక ఇంటికి రూ.70 వేలు ఇప్పటికే చెల్లించగా, మిగిలిన రూ.1.10 లక్షలతో మిగిలిన ఇంటి నిర్మాణం పూర్తి చేయడం అసాధ్యంగా చెబుతున్నారు. అయితే బేస్‌మెంట్ స్థాయి వరకూ నిర్మించి బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు ఇప్పుడు మిగిలిన భాగాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. బేస్‌మెంట్ మాయాజాలంతో సంపాదించిన డబ్బులతో వేరే వ్యాపారాలు చేసుకుంటున్నారు. నాడు హౌసింగ్ అధికారులు ఒక విధానం అంటూ లేకుండా అనామక వ్యక్తులందరికీ ఇళ్లను అప్పగించడంతో ఇప్పుడు వారి చేత పనులు చేయించడం కష్టంగా మారింది. ఇప్పటికే కట్టిన బేస్‌లు కూడా చాలా నాసిరకంగా ఉండడంతో వాటి స్థానంలో మళ్లీ బేస్ నిర్మించాలంటే

- మిగతా 7లో..

నాటి వైసీపీ హయాంలో పేదల ఇళ్ల మాటున జరిగిన దోపిడీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. ‘బేస్‌మెంట్’ మాయాజాలాన్ని చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. వందలు.. వేలు కాదు.. కోట్ల రూపాయల పేదల సొమ్మును దిగమింగారు. ప్రభుత్వ లేఅవుట్లలో పట్టణ ప్రాంతాల్లో ఆరు అంకణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తొమ్మిది అంకణాల స్థలాన్ని పేదలకిచ్చారు. ఈ స్థలంలో నిబంధనల ప్రకారం బేస్‌మెంట్ లెవల్ కట్టేందుకు రూ.30 వేలకు మించి ఖర్చవదు. కానీ హౌసింగ్ స్కీమ్‌లో బేస్‌మెంట్ స్థాయి నిర్మాణం జరిగితే రూ.70 వేలు చెల్లించారు. అంటే ఒక్కో ఇంటికి రూ.40 వేల వరకూ మిగుల్చుకున్నారు. పోనీ ఆ బేస్‌మెంట్ అయినా నిబంధనల ప్రకారం కట్టారా.. అంటే అదీనూ లేదు. ఆరడుగులకుపైగా పిల్లర్ లోతు ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల రెండు, మూడడుగులకు మించి లేదు. ఇలా కూడా ఒక్కో ఇంటిపై రూ.10 వేల వరకూ మిగిల్చుకున్నారని అంచనా. అదేవిధంగా బేస్‌మెంట్ స్థాయిలో 40 బస్తాల సిమెంటు, 340 కేజీల స్టీలు చెల్లిస్తారు. ఒక ఇంటికి వాడాల్సిన ఈ సామగ్రితో రెండు, మూడు ఇళ్ల బేస్‌లు కట్టి ఆ విధంగా కూడా దోపిడీ చేసినట్లు విచారణలో బయటపడుతోంది. మొత్తంగా ఈ బేస్‌మెంట్ మాయాజాలం ద్వారానే సుమారు రూ.100 కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టినట్లు అర్థమవుతోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరులోని దొడ్ల కౌశల్యమ్మ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డికి అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

ఉత్తమ గురువులకు అవార్డుల ప్రదానం

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. జిల్లా నుంచి ఆరుగురికి ఈ అవకాశం దక్కింది.











అవార్డు అందుకున్న సీహెచ్.చెన్నయ్య, కే.డామ్నిక్ రెడ్డి, సుజ ఎస్ నాయర్, ఎన్.భవానీ శంకర్, ఎస్.వింధ్యావళి





బూతద్దంలో అసర్‌ను చూస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు

ఉత్సాహంగా జులూస్ ర్యాలీ

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లాలోని అన్ని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. మహమ్మద్ ప్రవక్త సూచించిన నైతిక విలువలు, పరమత సహనం, దైవచింతన అనే అంశాలతోపాటు దివ్య ఖురాన్‌లోని దైవ సందేశాలను బోధించారు. ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో భారీ అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు జరిగాయి. జిల్లా కేంద్రం నెల్లూరులోని మసీదులలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక నమాజులు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, దివ్య ఖురాన్ పఠనం వంటి కార్యక్రమాల్లో ముస్లింలు భారీగా పాల్గొన్నారు. సాయంత్రం చాంద్ ఆకుపచ్చని జెండాలు, ప్లకార్డులతో కోటమిట్ట యూసుఫియా మసీదు సెంటర్‌కు ర్యాలీగా చేరుకున్నారు.

• వేడుకగా జులూస్ ర్యాలీ

మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా సాయంత్రం కోటమిట్ట యూసుఫియా మసీదు సెంటర్ నుంచి ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో జులూస్ శాంతి ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మత పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందకారంలో కూరుకుపోయిన ఆనాటి సమాజంలో దైవ ప్రవక్త మహమ్మద్ జ్ఞానజ్యోతులను వెలిగించారని తెలిపారు. విద్యా కుసుమాలు వెదజల్లారని అన్నారు. ఈ ర్యాలీలో ఇస్లామ్ సంప్రదాయ పచ్చజెండాలు, మక్కా, మదీనా చిత్రాలు, చాంద్‌లు ప్లకార్డులతో యూసుఫియా మసీదు నుంచి బారకాసు పాత జడ్పీ భవనం మీదుగా చిన్నబజారు, సంతపేటల మీదుగా తిరిగి మసీదు వరకు నిర్వహించారు. పోలీసు శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

తరిమేసిన కొడుకు.. కన్నీళ్లు తుడవని కూతుళ్లు

ముగ్గురు పిల్లలున్నా అనాథగా రైల్వేస్టేషన్‌లో.. • యాచిస్తూ కడుపు నింపుకుంటున్న వైనం



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో కూర్చొని ఉన్న నరసమ్మ

నానాటికి పేగుబంధాలు చితికిపోతున్నాయి. నవమాసాలు మోసి, అల్లారుముద్దుగా పెంచి ప్రయోజకులను చేసిన కన్నవారిని చివరాంకంలో రోడ్డుపాలు చేస్తున్నారు. పట్టెడన్నం దొరక్క వృద్ధులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈమె పేరు నరసమ్మ. ముగ్గురు బిడ్డలున్నా రైల్వేస్టేషనే దిక్కు అయ్యింది. ఇక్కడ యాచిస్తూ కడుపునింపుకుంటోంది. స్టేషన్‌లోని ఓ స్తంభం వద్ద దీనంగా కూర్చొని ఉన్న ఆ వృద్ధురాలిని ‘ఆంధ్రజ్యోతి’ పలుకరిచింది. ఆమె మాటల్లోనే...

‘మాది ఇందుకూరుపేట మండలం మైపాడు. ఇద్దరు కుమార్తెలు, ఓ కొడుకు ఉన్నారు. పిల్లలు చిన్నతనంలోనే భర్త చనిపోవడంతో రెక్కలు ముక్కలు చేసుకుని వారిని పెంచాను. కుమార్తెలకు వివాహం కాగా, ఒకరు భగత్‌సింగ్‌కాలనీలోను, మరికరు తిరుపతిలో ఉంటున్నారు. ఇక కుమారుడు వెంకటరమణకు వినికిడి లోపం ఉండటంతో దివ్యాంగ పింఛను అందుతోంది. ఈ కారణంగానే నాకు పింఛను రాలేదు. రెండు వారాల క్రితం ఆకలిగా ఉంది.. అన్నం పెట్టు అని కోడలిని అడిగితే లేదంది. ఇంట్లో వెళ్లి చూస్తే గిన్నె నిండా అన్నం ఉంది. ఈ విషయం కొడుక్కి చెబితే ఇంట్లోనుంచి ఇద్దరూ గెంటేశారు. ఏం చేయాలో దిక్కుతోచక ఇదిగో ఈ రైల్వేస్టేషన్‌లో తలదాచుకుంటున్నాను. ప్రయాణికులను యాచిస్తూ పొట్టనింపుకుంటున్నా’ అంటూ కన్నీటి పర్యంతమైంది. ముగ్గురు బిడ్డలున్నా అనాథలా రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై తలదాచుకుంటోంది.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 545

వినాయకుడి లడ్డూ రూ.1.82 లక్షలు

కందుకూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో ఉన్న శ్రీరామ్‌నగర్ ఎస్సీ కాలనీలో వినాయకుడి లడ్డూ వేలం పాటలో రూ. 1.82 లక్షలు పలికింది. కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుడి నిమజ్జనోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి లడ్డూకు వేలం పాట నిర్వహించగా కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు, బిల్డర్ తలతోటి మస్తాన్ రూ. 1.82 లక్షలకు దక్కించుకున్నాడు. ఈసందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మస్తాన్‌ను అభినందించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏవీ?

- బహిరంగ మార్కెట్లో ధరలు ఢమాల్ ● మద్దతు ధర కంటే రూ.3 వేలు తక్కువ
- మద్దతు ధర రాకపోతే రూ.180 కోట్లు నష్టం
- సీఎంఆర్ కింద కొనుగోలు చేయాలంటున్న రైతులు

జలదంకి, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడగారు వరిపంటలు కోతలకు వచ్చాయి. జిల్లాలో ఇప్పటికే అల్లూరు, కోవూరు తదితర మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన మండలాల్లో కూడా మరో 10,15 రోజుల్లో కోతలు మొదలుపెట్టనున్నారు. బహిరంగ మార్కెట్లో ధాన్యం ధరలు దళారీలో పుట్టి (857కిలోలు) రూ.17 వేలు పలుకుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పుట్టి (850 కిలోలు) రూ.20 వేలు కాగా రూ. 3వేలు తగ్గించి కొంటున్నారు. సీఎంఆర్ ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలు దళారీలకు తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరం పొలంలో మూడు పుట్ల ధాన్యం పండితే రైతులు ఎకరానికి రూ.9 వేలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుకు లాభంగా మిగిలే రూ.9 వేలు దళారీల పాలవుతోంది. ఈ ధరలు చూసి రైతులు పెట్టుబడులు కూడా వస్తాయో.. రావోనని ఆందోళన చెందు



తున్నారు. ఈ ఎడగారు సాగులో రైతులు ఎరువుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసి పైరుకు వేయాల్సి వచ్చింది. దీంతో అదనపు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. సాగునీరు పైరుకు సమృద్ధిగా అంది పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్న సంతోషం కాస్తా ధరల విషయంలో నీరుగారిపోయింది. జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా రైతులు వివిధ కాలువల కింద ఎడగారు వరి సాగు చేశారు. ఇలా 6 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి రానుంది. ఇవే ధరలు కొనసాగితే రైతులు రూ.180 కోట్ల మేర మద్దతు ధర దొరక్క నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఉన్న ధర కంటే మరింతగా క్షీణించే అవకాశం ఉందని దళారీలే బహిరంగంగా చెబుతున్నారు. అదే జరిగితే రైతులకు మరింత నష్టం వాటిల్లనుంది. కలెక్టర్ స్పందించి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధర దక్కేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సీఎంఆర్ కింద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



కనుల పండువగా గణేశ్ గ్రామోత్సవం

కావలి(టౌన్)సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కచ్చేరిమిట్టలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. కచ్చేరిమిట్ట గణేశ్ యూత్ నాయకుడు కావేటి శివ పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాల్లో 10 రోజులు వినాయకుడికి విశేష పూజలు చేశారు. రెండుసార్లు అన్నదానం ఆనవాయితీని కొనసాగించారు. విద్యుద్దీపాలంకరణ, బ్యాండ్ మేళాలు, కోలాటాల నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముసునూరు మందాటి చెరువులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. టీడీపీ 24వ వార్డు ఇన్‌చార్జ్ కావేటి కోటయ్య, 20వ వార్డు ఇన్‌చార్జ్ పెంచలయ్య, రమణయ్య, శేషగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రైవేటు పరం చేయొద్దు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల పర్యవేక్షణ బాధ్యతలను ప్రయివేటు సంస్థలకు ఇవ్వాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా కంపెనీలకు అప్పగిస్తూ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వమే స్వయంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్వహించడం వలన ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ నుంచి పేద ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి గ్రామం నడిబొడ్డున్న సర్వే నెంబరు 78-1లో ఎ 3-20 సెంట్లు చుండి రామలింగేశ్వర స్వామి, మహలక్ష్మమ్మ అమ్మవారి ఆలయ భూమి ఆక్రమణలకు గురవుతోందని చుండి మాజీ ఉపసర్పంచ్ కామినేని వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కోట్ల రూపాయల విలువ కలిగిన భూమిని కొంత మంది గ్రామస్థులు ప్రహరీ గోడలు నిర్మించి రేకులషెడ్లు వేసి ఆక్రమించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని వీరయ్య కోరారు.

కంప చెట్ల తొలగింపు

బిట్రగుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం చెరువు గట్టు పక్కనున్న పొలాలకు వెళ్లే దారిలో కంపచెట్లను చెరువునీటి సంఘం అధ్యక్షులు కాండ్ర వేణుగోపాల్ శుక్రవారం తొలగింపు పనులు చేపట్టారు. రెండో పంట కోత సమయం దగ్గర పడంతో కంప చెట్లు రోడ్డుపై వాలి పాములు సంచరిస్తున్నట్లు రైతులు తెలిపారన్నారు. అంతే కాకుండా శ్మశానవాటికు వెళ్లే దారి కావడంతో స్థానికులు, రైతుల కోరిక మేరకు ఎక్స్‌కవేటర్‌తో ముళ్లపొదలు తొలగించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కాండ్ర రఘురామనాయుడు, మల్లికార్జున పాల్గొన్నారు.



కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అవినీతికి అదే 'బేస్'!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు సరిపోవు. పోనీ కొత్తవారితో మిగిలిన పనులు చేయిద్దామా.. అంటే గిట్టుబాటు కాదని వారు వెనకడుగు వేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాటి హౌసింగ్ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. కాగా కొన్నిచోట్ల బేస్‌మెంట్‌లు కూడా నిర్మించకుండానే అధికారులు బిల్లులు చెల్లించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇలా కట్టిన నిర్మాణాలకు, చెల్లించిన మొత్తాలకే భారీ తేడా ఉందని గుర్తించి విజిలెన్స్ విభాగం సుమారు రూ.110 కోట్లు జిల్లాలో దుర్వినియోగమైనట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

ప్రవక్త బోధనలు ప్రపంచానికి వెలుగు

● మిలాదున్ నబీ ఉత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



ముస్లింల ర్యాలీలో ఎమ్మెల్యే, నాయకులు

కావలి(టౌన్) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచానికి వెలుగని ఎమ్మెల్యే డీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మిలాదున్ నబీ పర్వదినం పురస్కరించుకుని హిందూ, ముస్లింలు నిర్వహించిన ఉత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని జెండా చెట్టు సెంటర్ వద్ద ర్యాలీని ప్రారంభించారు. పచ్చ జెండా చేతబట్టి ర్యాలీలో పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. బీపీఎస్ కూడలి వద్ద ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సర్వ మానవ కల్యాణం కోసమే జన్మించారన్నారు. ఆదర్శ మానవ జీవన విధానానికి మార్గదర్శకులయ్యారన్నారు. ఆయన బోధనలు ఆచరణీయమని, మతసామరస్యానికి ప్రతీక మహమ్మద్ ప్రవక్త అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ర్యాలీలో ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య, టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ కిశోర్, బాబురావు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు ముస్లిం యువత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని శుక్రవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని జామియా మజీద్‌లో టీడీపీ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు విందుభోజనం ఏర్పాటుచేశారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్-ఉన్-నబీ వేడుకలను మండలంలోని ముస్లింలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ముస్లిం పెద్దలు స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేపట్టారు.

పార్టీ కోసం శ్రమించినవాళ్లకే పదవులు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కావలి సొసైటీ చైర్మన్‌గా కాటా భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లుగా సోమయ్యగారి రమణ, కమతం ప్రసాద్‌లు శుక్రవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. పాతూరు శివాలయం పక్కన ఉన్న కల్యాణ మండపంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడినవారికి పదవులలో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కావలి సొసైటీ ద్వారా రైతులకు సేవలు అందించాలన్నారు. రైతులు సొసైటీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నేతలు జ్యోతి బాబూరావు, ఆవుల రామక్రిష్ణ, జనిగర్ల హేంద్ర, కండ్లగుంట మధుబాబు నాయుడు, పొట్లూరు శ్రీనివాసులు, దగుమాటి మాల్యాద్రి రెడ్డి, పీ. మధుసూదనరెడ్డి, చిలకపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా 31 మంది లబ్దిదారులకు రూ. 18,07,248 చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటివరకు సీఎం సహాయనిధికి 902 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 587 మందికి రూ.5,44,41,980 అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



కావలి సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కాటా భాస్కర్

వైసీపీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా హనుమంతరావు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా వలేటివారిపాలెంకు చెందిన కట్టా హనుమంతరావు, జిల్లా బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా ఇరపని అంజయ్యను నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడి నుంచి ఆదేశాలు జారీ అయినట్లు మండల వైసీపీ అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హనుమంతరావు, అంజయ్యలు మాట్లాడుతూ జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాని గోవవర్ధన్‌రెడ్డికి, కందుకూరు నియోజకవర్గం ఇన్‌చార్జి బుర్రా మధుసూధన్‌యాదవ్‌కు, మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహంకు కృతజతలు తెలిపారు.

● కార్యనిర్వాహక సభ్యుడిగా పోతులూరయ్య

లింగసముద్రం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా రైతు వింగ్ కార్యనిర్వాహక సభ్యుడిగా మండలంలోని పెంట్రాలకు చెందిన కొమ్మి పోతులూరయ్య నియమితులయ్యారు. ఈమేరకు కందుకూరు వైసీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. తనను ఎదవిలో నియమించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కందుకూరు పార్టీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదనరావు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జమునకు సాహితీ పురస్కారం



మండలి బుద్ధప్రసాద్ నుంచి పురస్కారమందుకుంటున్న జమున

కావలి(టౌన్), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని రామమోహన గ్రంథాలయంలో జరిగిన గురుపూజోత్సవంలో కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని ఎన్ జమున సాహితీ పురస్కారం అందుకున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంసీ దాస్, పూర్ణచంద్ర గాంధీ, విశ్రాంత వీసీ వియాన్నరావు, క్రుష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు చేతుల మీదుగా జమున పురస్కారం అందుకున్నారు.

సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో...

స్థానిక వెంగళరావునగర్‌లోని కార్యాలయంలో సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్యక్షతన శుక్రవారం గురుపూజోత్సవ సభ నిర్వహించారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ పాల్గొని గురువులను సత్కరించారు. సత్కారమందుకున్న ఉపాధ్యాయుల్లో ప్రసాదరావు, ఖాదర్‌బాషా, కల్యాణి, అజిత్‌బాబు, శివప్రసాద్ రెడ్డి, సాయి తేజ తదితరులు ఉన్నారు.

వడ్డీ వ్యాపారంలో వివాదం.. కేసుల నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారంలో ఇద్దరు మహిళల మధ్య తలెత్తిన వివాదంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసులు నమోదైనట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నేటికోటకు చెందిన నంబూరి అనురాధ అదే గ్రామానికి చెందిన గొత్తుల నాగమణి వద్ద నుంచి మూడేళ్ల క్రితం రూ.2 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇటీవల కాలంలో అనురాధ కొంత సొమ్ము చెల్లించగా, మిగిలిన డబ్బు ఈనెల 3వ తేదీన వడ్డీ తగ్గించి చెల్లించబోయింది. దీంతో వడ్డీ తగ్గించేది లేదని, చెల్లించాలని నాగమణి పట్టుపట్టడంతో ఇద్దరి మధ్య వాదనలు జరిగాయి. ఈక్రమంలో తనను కొట్టి మెడలోని 6 సవర్ల బంగారు గొలుసు నాగమణి లాక్కొందని, గాయపడిన అనురాధ ఉలవపాడు సీహెచ్‌సీలో చేరగా వైద్యుల రిపోర్టు మేరకు నాగమణిపై కేసు నమోదు చేశారు. కాగా, తనకు చెల్లించాల్సిన డబ్బులు అడగానికి వెళ్లిన తనను అనురాధ, ఆమె కొడుకు కలిసి కొట్టగా నాగమణి కూడా ఉలవపాడు ఆసుపత్రిలో చేరింది. వైద్యుల సమాచారంతో అనురాధ, ఆమె కొడుకుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'ప్రకాశం'లో టీవీఎస్ బ్రేక్స్ ఇండియా ప్లేస్‌మెంట్ డ్రైవ్

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న టీవీఎస్ బ్రేక్స్ ఇండియా సంస్థ స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ విభాగాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థులు పాల్గొనగా రాతపరీక్ష, సాంకేతిక ఇంటర్వ్యూ, హెచ్ఆర్ ఇంటర్వ్యూల అనంతరం 32మందిని ఉద్యోగాలకు ఎంపికచేసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తు పరిశ్రమల దశను నిర్ణయించేది కోర్ శాఖలేనని, అందుకే తమ విద్యార్థులను కోర్‌లో నిపుణులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టరు విక్రం, సాహిత్య, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, సుమలత, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో టీవీఎస్ బ్రేక్స్ ఇండియా సంస్థ హెచ్ఆర్ ప్రతినిధులు

ఘనంగా గురుపూజోత్సవం

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఏఐ బ్రాంచ్ విద్యార్థులు కేకు కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులను సత్కరించారు. వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బొగ్గవరపు వెంకటరామయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, చెక్కా కేశవ, కాకుమాను ప్రవీణ్‌కుమార్, ఇన్నమూరి శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, కంకణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కందుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1975 సంవత్సరం పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కోలాహలంగా జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో తమకు పదవ తరగతిలో విద్యాబోధన చేసిన గురువులందరినీ స్మరించుకున్నారు. ప్రస్తుతం వారిలో ఒక్కరు మినహా మరెవరూ లేనందున వారికి నివాళులర్పించారు. ప్రస్తుతం జీవించిఉన్న నాటి గురువు బొగ్గవరపు వెంకటరామయ్య నివాసానికి పూర్వవిద్యార్థులంతా వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు.

సృష్టిలో గురువు స్థానం అత్యున్నతం

● ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



కొండాపురం : సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

కావలి, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): తల్లి జన్మనిస్తే.. తండ్రి నడకనేర్పితే.. జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేది మాత్రం గురువేనని, సృష్టిలో గురువు స్థానం అత్యున్నతమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముందుగా సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించించారు. సాధారణ ఉపాధ్యాయుడి నుండి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. తాను కూడా ఉపాధ్యాయవృత్తి నుంచే ఎదిగానని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు.

జడ్పీ హైస్కూలుకు పూర్వవైభవం తీసుకొస్తాం...

సుమారు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కావలి జడ్పీ హైస్కూలుకు పూర్వవైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. దానిని మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లో చెరో 1200 మంది విద్యార్థులు చదువుకునేలా ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీడీవో శ్రీదేవి, మండల విద్యాశాఖాధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యలతో కలిసి ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నేతలు గుత్తికొండ కిశోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మధుబాబు నాయుడు, రాంప్రసాద్, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.



ఉలవపాడు : అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం

ఘన సన్మానం

కొండాపురం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారులు రవికుమార్, ఆనందరావులు మాట్లాడుతూ విద్యార్థులను జ్ఞాన జ్యోతులతో వెలుగును చూపే బాధ్యత గురువులదేనన్నారు. బిడ్డలను ప్రపంచం గుర్తించేవిదంగా తీర్చిదిద్దేది గురువులేనన్నారు. ఉపాధ్యాయ వృత్తికే గుర్తింపుతెచ్చి భారతరత్న అవార్డు అందుకొని రాష్ట్రపతి పదవికి ఎంపికయిన డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మండలపరిధిలో ప్రాథమిక పాఠశాలస్థాయిలో 10 మంది, జడ్పీ ఉన్నత పాఠశాలల నుండి 5 మంది, సాయిపేట మెయిన్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్‌రావులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వగా ఘనంగా సన్మానించారు. అలాగే ఉత్తమ సేవలు అందించిన సీఆర్ఎమ్‌టిలను ఈసందర్భంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండలపరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

కలిగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో శుక్రవారం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా విద్యాభివృద్ధికి కృషి చేస్తే గుర్తింపు వస్తుందన్నారు. ఈ సందర్భంగా 17 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ, ఉపాధ్యాయ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉలవపాడులోని అంగన్‌వాడీ సెంటర్-1లో సూపర్‌వైజర్ రమాదేవి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త హేమలత, ఆయా వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా హనుమంతరావు

అల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా కె. హనుమంతరావు ఎంపికయ్యారు. ఆయనతోపాటు ఏ యూనస్, బీ చంద్రశేఖర్, ఎస్‌డీ. పర్వీన్, వై రమేష్, పీ సంపూర్ణమ్మ, పీ నాగరాజు, కే సాధనలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సుబ్బయ్య బడి)లో నిర్వ హించే కార్యక్రమంలో వీరిని అవార్డులతో సత్కరించనున్నారు.

మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సునీత



వలేటివారిపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మద్దినేని సునీత ఎంపికైనట్లు ఎంఈఓ మల్లికార్జునరావు తెలిపారు. ఆమె ప్రస్తుతం శింగమనేనిపల్లె హెచ్‌పి స్కూల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తునట్లు తెలిపారు. కాగా, మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన సునీతకు పలువురు టీచర్లు అభినందనలు తెలియజేశారు.



బ్రిటీష్ కాలం నాటి చెక్కుచెదరని తూము

వేలాది ఎకరాలకు సాగు నీరందించే బ్రిటీషుకాలం నాటి కాలువ తూము ఇప్పటికీ చెదరలేదు. బ్రిటీషు కాలం నాటిదైనా నేటికీ రాజసం ఉట్టిపడుతోంది. కోవూరు చెరువు నుంచి వెల్లవ కాలువ, కలుజు కాలువలకు నీరు ప్రవహించేందుకు వీలుగా గిరిజనకాలనీకి వెళ్ళే డొంక ప్రాంతంలో అప్పట్లో తూము ఏర్పాటు చేశారు. అవసరమైనంత మేర నీరు పారే విధంగా తూముకు చెక్కల్ని నిర్మించారు. ఏ వారం ఎంత నీరు ప్రవహించాలో తెలియచేస్తూ నీటిపారుదల శాఖాధికారులు అప్పట్లోనే లెక్క కట్టి తూము నిర్వహణ చేపట్టారు. ఇప్పటికీ అదే విధానంతో వేలాది ఎకరాలకు ఈ తూము గుండానే సాగు నీరందుతోంది. అయితే ఈ తూముకు ఇరువైపులా ఇటీవల కాలంలో పిచ్చి చెట్లు మొలిచాయి. వాటిని తొలగించాల్సిందిగా రైతులు కోరుతున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

కోవూరు చెరువు నుంచి వచ్చే వెల్లువ కాలువ తూము

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని శైవ క్షేత్రాల్లో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి నవావరణ పూజలు జరిగాయి. సాయంత్రం నందీశ్వరునికి విశేష అభిషేకాలు, వెండి నందిసేవ జరిగాయి. ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు పర్యవేక్షించారు.

● రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం సామూహిక రాహుకాల ఉద్వాపన పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చండీహోమం, సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం సుందరేశ్వరస్వామికి, నందీశ్వరునికి పాలాభిషేకం, పంచామృతాభిషేకాలు జరిగాయి. రాజరాజేశ్వరి అమ్మవారికి కుంభహారతులు, పల్లకీసేవ వైభవంగా జరిగాయి.



రాజరాజేశ్వరి ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు

● రేపు ఆలయం మూత

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4.30 గంటల నుంచి రాజరాజేశ్వరి ఆలయాన్ని మూసివేస్తామని ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. 8వ తేదీ ఉదయం సంప్రోక్షణ, స్నపన తిరుమంజనం జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం నిత్య కైంకర్యాలు జరిపి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని వివరించారు.



మూలస్థానేశ్వరాలయంలో నంది వాహనంపై ఆదిదంపతులు

గురితప్పని మణి

మారుమూల పల్లెలో రైతు కుటుంబానికి చెందిన ఓ యువకుడు ఆర్చరీలో దూసుకుపోతున్నాడు. బాణం వేశాడంటే పతకం రావాల్సిందే అన్నట్టుగా ప్రతిభ చాటుతున్నాడు. ఆ విలుకాడే లింగసముద్రం పంచాయతీ వాకమళ్లవారి పాలెం గ్రామస్థుడు గొర్రెపాటి మణిదీప్ రెడ్డి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి ఇప్పటికే ఎన్నో పతకాలు సాధించాడు. వాటిలో 16 స్వర్ణ పతకాలు ఉండటం విశేషం. అంతేకాదు అమెరికాలో జరిగిన పోటీల్లోనూ రాణించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్న బాణధారి ఈ మణిదీపుడు.



ప్రతిభ PRATIBHA

- ● బాణం వేశాడంటే పతకం రావాల్సిందే!
- ● ఆర్చరీలో దూసుకుపోతున్న లింగసముద్రం యువకుడు
- ● 16 బంగారు పతకాలు సొంతం
- ● రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణింపు
- ● అమెరికాలో పోటీలకూ హాజరు

రైతు కుటుంబంలో జన్మించిన మణిదీప్ 2014లో కడపలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో చేరాడు. అక్కడే విలువిద్యలో శిక్షణ ప్రారంభించాడు. ఆ క్రీడా పాఠశాలలోనే ఇంటర్మీడియట్ వరకు చదివి ప్రస్తుతం విజయవాడలోని శాతవాహన కాలేజీలో బీఏ చదువుతున్నాడు. విలువిద్యపై ప్రత్యేక శ్రద్ధపెట్టి 5వ తరగతి నుంచే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. 2015-16 నుంచి 2023-24 సంవత్సరాల మధ్య జిల్లా స్థాయిలో పలు ప్రాంతాల్లో జరిగిన అండర్-10, అండర్-14, సబ్ జూనియర్, జూనియర్ విభాగాల పోటీల్లో పాల్గొని 16 బంగారు పతకాలు సాధించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి క్రీడా ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. అమెరికాలో లాస్‌వేగాస్‌లో రెండు సార్లు జరిగిన పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. అయితే గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఆ విలుకాడు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు స్పాన్సరర్ కోసం ఎదురు చూస్తున్నాడు. ఎవరైనా ముందుకు వచ్చి ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడానికి సిద్ధమవుతున్నాడు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)



అమరావతి చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి శాప్ చైర్మెన్ రవినాయుడు నుంచి బంగారు పతకం, ట్రోఫీ అందుకుంటున్న మణిదీప్‌రెడ్డి టీం

పోటీలు - పతకాలు



- ● మణిదీప్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 2016-17 నుంచి 2024-25 సంవత్సరాల మధ్య సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నారు. 4 బంగారు, 4 రజత, 1 కాంస్య పతకం సాధించారు. ఉత్తమ ప్రదర్శనకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు.
- ● జాతీయ స్థాయిలో 2015-16 నుంచి 2023-24 సంవత్సరాల మధ్య ఖేలో ఇండియా సౌత్ నేషనల్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ, సీనియర్ నేషనల్, నేషనల్ స్కూల్ గేమ్స్, మినీ నేషనల్ ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నారు. ఒక బంగారు పతకం, ఒక కాంస్య పతకం సాధించారు.
- ● గత నెల 21 నుంచి 28 వరకు రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో నిర్వహించిన అమ రావతి చాంపియన్‌షిప్ పోటీల్లో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రెండు బంగారు పతకాలు, వ్యక్తిగత విభాగంలో ఒక రజత పతకం సాధించారు.
- ● గత ఏడాది ఫిబ్రవరిలో ఇండియా తరపున ఓల్గా ఆర్చరీ అకాడమీ వారు అమెరికాలోని లాస్‌వేగాస్‌లో వేగా షూట్ ఆర్చరీ టోర్నమెంట్ నిర్వహించగా జూనియర్ విభాగంలో మణిదీప్‌రెడ్డి పాల్గొని 5వ స్థానంలో నిలిచారు.
- ● ఈ ఏడాది మార్చిలో అక్కడే జరిగిన అదే టోర్నమెంట్‌లో సీనియర్ విభాగంలో పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు పురస్కార సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో జిల్లావ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 38 మందిని కలెక్టర్ ఆనంద్, అధికారులు ఘనంగా సత్కరించి పురస్కారాలు అందచేశారు.



చిత్తూరు వెంకటేశ్వర్లు (కందుకూరు)ను సత్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, నుడా చైర్మన్ కోటంరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు



టి.సుబ్రహ్మణ్యం, షేక్ ఫాతిమజన్, కె.రమేష్, సీహెచ్.శివశంకర్, బి.రామమోహన్, షేక్ కరిముల్లా సాహెబ్, కెవి.రమణరెడ్డి, డి.మాలకొండయ్య, జి.వెంకటేశ్వర రావు, గీత మాధురి, డి.శ్రీనివాసులు, ఎ.వెంకటేశ్వర రావు, ఎం.వెంకటకృష్ణయ్య, రాజ్‌కుమార్, ఎం.రమణ కుమార్, గింజి శ్రీనివాసులు, శ్రీలం లక్ష్మి శ్రీదేవి, రమేష్‌బాబు, కామినేని పద్మజ, నెల్లూరు కల్యాణ్, మధుసూదన్‌రావు, జనిగర్ల శ్రీనివాసులు, రత్నయ్య, జమ్మల నరసింహయ్య, రామ కొండప్పనాయుడు, వారణాసి భాస్కర్, లెక్కల శ్రీనివాసులు, శ్రీలత, ఓంకారం శ్రీనివాస రాజు, రాచూరి ఆదెయ్య, ఎ.మురళీమోహన్, వి.ఫణీంద్ర మోహన్, ఖాదర్ బాషా, షాహెద అక్తర్, దినారి ప్రభాకర్

ఇండోసోల్ ప్రతినిధులపై దాడి

● కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ కంపెనీలో డిజిటల్ మీడియా పనులు నిర్వహిస్తున్న వారిపై కరేడు గ్రామానికి చెందిన సుమారు 20 మంది దాడిచేసి బెదిరించిన సంఘటపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఇండోసోల్ కంపెనీలో డిజిటల్ మీడియాలో విధులు నిర్వహిస్తున్న మునీశ్వర అతని సహచరులు మరో ఐదుగురు కరేడు గ్రామంలో ఓరుగంటమ్మ గుడి ప్రాంతంలో గురువారం సాయంత్రం సర్వే నిర్వహిస్తుండగా సుమారు 20 మంది గ్రామస్తులు వచ్చి గొడవపడి చంపేస్తామంటూ బెదిరించారని, కంపెనీ బాధ్యతలు నిర్వహిస్తున్న తమను బెదిరించిన వ్యక్తులను విచారించి వారినుంచి రక్షణ కల్పించాలని స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు.

రోడ్డుపై గుంత.. వాహనదారుల చింత...

ఉదయగిరి, సెప్టెంబు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోంపల్లి, కరీమా వీధులకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంత ప్రమాదాలకు కారణమవుతోంది. మురుగు కాలువపై ఏర్పాటుచేసిన సిమెంట్ అచ్చులు ధ్వంసం కావడంతో రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. సమీపానికి వెళ్లేవరకు కనిపించక పోవడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.



విద్యాభివృద్ధికి బాధ్యతతో పని చేయాలి

- ● సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు : కలెక్టర్ ఆనంద్
- ● గురుపూజోత్సవంలో 38 మంది టీచర్లకు అవార్డులు, సత్కారం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో గురుపూజోత్సవ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. రానున్న పదేళ్లలో విద్యావ్యవస్థలో రానున్న సమూల మార్పులను దృష్టిలో ఉంచుకుని టీచర్ల శిక్షణ పొంది విద్యార్థులకు విద్యనందించాలన్నారు. జిల్లాలోని మోడల్ ప్రైమరీ స్కూల్స్ వ్యవస్థను విజయవంతంగా నడిపించే బాధ్య త ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రైవే ట్, ప్రభుత్వ పాఠశాలలు సమన్వయంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లలందరూ ఉన్నతంగా ఎదిగేందుకు పూర్తిస్థాయి ప్రోత్సాహం, సహకారంతోపాటు నాణ్యతతో కూడిన విద్యనందించాలని సూచించారు. తాను కూడా విద్యాశాఖపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ గురుతత్వాన్ని స్మరించుకుంటూ ఉపాధ్యాయులు విద్యారంగం ఉన్నతికి పాటుపడాలన్నారు. పెరిగిన ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు సాంకేతిక బోధన అందించాలన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి పదవులను అలంకరించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాంలను టీచర్లు ఆదర్శంగా తీసుకుని వారి బాటలో పయనించాలన్నారు. తన వంతు విద్యాభివృద్ధికి ఏసీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 38 మందిని ఘనంగా సత్కరించి అవార్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ్‌కుమార్, డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఉన్న పెన్షనర్స్ భవన్‌లో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం.గౌస్ అధ్యక్షత జరిగింది. ముందుగా ఆయన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలు వివరించారు. పెన్షనర్స్ సమస్యల పట్ల రాష్ట్ర సంఘం తీసుకుంటున్న చర్యలు అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.వెంకటేశ్వర్లు వివరించారు. ఒక సంఘం నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పెన్షనర్స్ సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం వివరించారు. కొత్తగా రిటైర్డు అయిన ఉద్యోగులు పెన్షనర్స్ సంఘంలో చేరి బాధ్యతలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. గౌరవాధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షుడుగా ఎస్‌ఎం.గౌస్, సహ అధ్యక్షుడుగా ఎన్.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీవీఎస్ మూర్తి, కోశాధికారిగా జే.హజరత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా సీహెచ్ రఘునాథ్, 7మంది ఉపాధ్యక్షులు, 7మంది సహాయ కార్యదర్శిలతోపాటు 35 మంది కార్యవర్గ సభ్యులు, డివిజన్ కార్యదర్శులు, గౌరవ సలహాదారులను ఏకగ్రీవంగా ఎనున్నకున్నారు. నూతన కార్యవర్గంతో విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేయించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా కార్యవర్గం

నిలువ నీడ కరువాయె..!

ఉదయగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉండేందుకు ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. ప్రధానంగా సీతారామపురం, గండిపాళెం మార్గాల్లో ఎలాంటి బస్‌షెల్టర్లు లేవు. నెల్లూరు మార్గంలో బస్‌షెల్టర్ ఉన్నా యాచకులకు నిలయంగా మారడం, అపరిశుభ్రతగా తయారైంది. దీంతో ప్రయాణికులు ఆరుబయట ఎండలో, దుకాణాల వద్ద తలదాచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులకు నీడ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

● జిల్లా కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగరంలోని ఎస్‌వీజీఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం అప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంలో బోధనలో కూడా వినూత్న పద్ధతులు అవలంబిస్తూ బోధించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ మరింత బాధ్యతతో వ్యవహరించి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని తెలిపారు. తొలుత ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనం తరం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే 2,500 మంది ఉపాధ్యాయులను సత్కరించి మెమెంటోలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ భాస్కర్ రెడ్డి, అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు సింహారావు, అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నందకిషోర్ పాల్గొన్నారు.



టీచర్‌ని సత్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్